

సభా ప్రాంగణం మ్యాప్‌ను పరిశీలిస్తున్న లోకేశ్, అచ్చెన్నాయుడు పుల్లారావు తదితరులు.



- అధికారపార్టీ ప్రచార పిచ్చికి ఉద్యోగులు బలి
- స్వామి కార్యంతోపాటు స్వకార్యానికీ తప్పని ఈకేవైసీ
- ప్రతి పథకానికి ఈ కేవైసీ కావాలంటూ ఆదేశాలు
- 'ఇంటింటికీ సంక్షేమం' పేరుతో లబ్ధిదారులకు లేఖలు
- దానికీ ఈ కేవైసీ తప్పనిసరి చేసిన ప్రభుత్వం
- ఛీ.. పొమ్మంటున్న లబ్ధిదారులు
- పలుచోట్ల వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులపై దాడులు

అడ్డగోలు వాడకం!

గుంటూరు, మార్చి13(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు నియోజకవర్గం పరిధిలోని ఒక వలంటీర్ ఆన్‌లైన్ ఆధార్ ఈ కేవైసీ కోసం ఒకరి ఫోనుకు ఓటీపీ పంపింది. ఆ ఓటీపీ చెప్పాలని ఆ నెంబరుకు కాల్ చేసింది. కాల్ లిఫ్ట్ చేసిన ఆ ఇంటి మహిళ తన భర్తకు పదేపదే ఎందుకు ఫోన్ చేస్తున్నావంటూ వలంటీర్‌తో గొడవకు దిగింది. వివాహేతర సంబంధం వుందంటూ ఆరోపణలు చేసింది. దీనిపై పంచాయతీ కార్యదర్శికి వలంటీర్ ఫిర్యాదు చేసింది. అతడు పట్టించుకోకపోవడంతో ఆ వలంటీర్ పోలీసులను ఆశ్రయించేందుకు సిద్ధమయింది. ఇలాంటి ఘటనలు జిల్లాలో అనేకం జరుగుతున్నాయి. ఈ కేవైసీల కోసం పదేపదే ఫోన్లు చేయడం, వేలిముద్రల కోసం పదేపదే ఇళ్లకు వెళ్లడం వంటి కారణాలతో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పడరాని పాట్లు పడుతున్నారు. జిల్లాలో నిత్యం ఏదో ఒక మూల ఇలాంటి ఘటనలు జరుగుతూనే వున్నాయి.

అవమానాల పాలవుతున్న ఉద్యోగులు, వలంటీర్లు

అధికార వైసీపీ ప్రచార పిచ్చి సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు లేనిపోని తిప్పలు తెస్తోంది. ఉద్యోగం, ఉపాధి మాట ఎలా వున్నా సమాజం లో వారి పరిస్థితి అత్యంత దయనీయంగా మారుతోంది. ప్రభుత్వ అడ్డగోలు వాడకం కారణంగా వారికి అవ మానాలే మిగులు తున్నాయి. సమాజంలో అనేక ఛీత్కారాలకు గురవుతున్నారు. వారి వ్యక్తిగత జీవితంపైనే ముద్ర వేయించుకునే పరిస్థితి వస్తోంది. సంక్షేమ పథకాలతోపాటు సొంత ప్రచారానికి కూడా వారిని వాడేస్తుండడంతో ప్రజల్లో వలంటీర్లు, సచివాల య ఉద్యోగులంటే ఛీత్కార భావం కలు గుతోంది.

స్వకార్యానికి కూడా ఈ- కేవైసీ


సంక్షేమ పథకాల పేరుతో పదుల సంఖ్యలో ఈ- కేవైసీ చేయిస్తున్న ప్రభుత్వం అవి చాలవన్నట్లు సొంత ప్రచారానికి కూడా ఈ కేవైసీ చేయించాలని డిమాండ్ చేస్తోంది. 'ఇంటింటికీ సంక్షేమం' పేరుతో ముఖ్యమంత్రి పేరుతో వచ్చిన లేఖను లబ్ధిదారుల ఇంటికి చేర్చి వారితో ఈ కేవైసీ చేయించాలని ఆదేశాలు జారీచేసింది. దీనిపై లబ్ధిదారుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. లబ్ధిదారులు పొందిన సంక్షేమ ఫలాలతో ఎలాంటి సంబంధం లేని తప్పుడు లెక్కలతో ఈ లేఖలు ఉండడంతో లబ్ధిదారులు వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులను ఛీ.. పొమ్మంటున్నారు. దీంతో వారు తలలు పట్టుకుంటున్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో అధికారులతోపాటు, అధికార వైసీపీ నేతలు కూడా వలంటీర్లు, ఉద్యోగులపై ఒత్తిడి పెంచుతున్నారు. ఈ ఒత్తిడి భరించలేని ఉద్యోగులు లబ్ధిదారులను అదేస్థాయిలో ఒత్తిడి పెడుతున్నారు. దీంతో లబ్ధిదారులు వారికి ఎదురు తిరిగుతున్నారు. పలుచోట్ల దాడులకు కూడా దిగుతున్నారని వలంటీర్లు వాపోతున్నారు. ఇదిలా వుండగా, రేపు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తరువాత తమ పరిస్థితి ఏమిటా.. అని వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు గగ్గోలు పెడుతున్నారు.

ప్రతి పథకానికి ఈ- కేవైసీ

ప్రభుత్వం తాను అమలు చేస్తున్నానన్న ప్రతి పథకానికి ఈ కేవైసీని తప్పనిసరి చేసింది. ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ చేసినందుకు, ఆరోగ్యశ్రీ కార్డు పంపిణీ చేసినందుకు, ఇళ్ల పట్టాలు పంపిణీకి, పాలవెల్లువ సర్వేకు, క్యాస్ట్ సర్వేకు.. ఇలా ప్రతిదానికీ ఈ కేవైసీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఇది క్షేత్రస్థాయిలో పనిచేసే వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులకు అనేక సమస్యలు తెచ్చిపెడుతోంది. ఈ కేవైసీ వేలిముద్రల కోసం వలంటీర్లు ఇళ్లకు వెళుతుండడంపై గృహిణులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఓటీపీ ద్వారా ఆన్‌లైన్ ఈ కేవైసీ కోసం వలంటీర్లు సంబంధిత మొబైల్ నెంబర్లకు ఓటీపీలు పంపుతున్నారు. అవి తెలుసుకోవడానికి పదే పదే ఫోన్లు చేస్తున్నారు. దీంతో లబ్ధిదారుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. పదే పదే ఇళ్లకు వెళ్లడం, ఫోన్లు చేయడంపై వారిలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అదే విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారేమీ పట్టించుకోవడం లేదు. మాకు అవన్నీ అనవసరం ఈ కేవైసీ కావాల్సిందేనని పట్టు పడుతున్నారు. దీంతో వారు ఇరువైపులా నలిగిపోతున్నారు.

ఇవ్వని పథకాలు ఇచ్చినట్లుగా..

వలంటీర్లపై మండిపడుతున్న ప్రజలు



గడప గడపకు సంక్షేమం పేరుతో స్థలం ఇవ్వకుండానే ఇచ్చినట్టు ఇచ్చిన తప్పుడు పత్రం

ప్రత్తిపాడు: మా ఐదేళ్ల పాలనలో మీ కుటుంబానికి వచ్చిన లబ్ధి ఇది అంటూ ఇస్తున్న పత్రాలను చూసి ప్రజలు విస్తుపోతున్నారు. రెండు రోజులుగా వలంటీర్లు ఇంటింటికి వచ్చి లబ్ధి వివరాలతో కూడిన పత్రాలను కుటుంబ యజమానులకు అందజేసి వారి నుంచి వేలిముద్రలు సేకరిస్తున్నారు. అయితే ఆయా పత్రాలు చూసుకున్న చాలామంది తమకు ఆ పథకాల లబ్ధి అందలేదని వలంటీర్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల స్థలాలు ఇవ్వకుండానే స్థలాలు ఇచ్చినట్లు, అమ్మఒడి ఒక్కసారి పడితే రెండు సార్లు అందుకున్నట్లు, రైతు భరోసా పడకుండానే పడినట్లు, సున్నా వడ్డీలో తప్పులు, వైద్యశాలకు వెళ్లకుండానే ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం చేయించుకున్నట్లు.. ఇలా పలు తప్పుడు లెక్కలు, లబ్ధిలో హెచ్చులు కనిపిస్తుండటంతో లబ్ధిదారులు విస్తుపోతున్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో వలంటీర్లు పంపిణీ చేసిన గడప గడపకు సంక్షేమం పత్రాలలో ఇలాంటి తప్పులు కో కొల్లలుగా వెలుగుచూస్తున్నాయి. ఈ తప్పుల విషయంలో అధికారులు నోరు మెదపడంలేదు. ప్రత్తిపాడులో చెర్లోపల్లి బుల్లెమ్మాయికి రూ.2 లక్షల విలువైన ఇంటి స్థలం వచ్చినట్లుగా పత్రం అందజేశారు. అయితే ఆమెకు స్థలం ఇవ్వలేదని రెవెన్యూ అధికారులు కూడా ధృవీకరిస్తున్నారు. దీంతో ఆమె కుటుంబసభ్యులు తమకు స్థలం ఇవ్వకపోయినా ఇచ్చినట్లుగా పత్రంలో నమోదు చేయడం ఏమిటని మండి పడుతున్నారు. పెదనందిపాడుకు చెందిన ఎం శ్రీనివాసరావు అనే వ్యక్తికి ఆరోగ్య శ్రీ ద్వారా రూ.60 వేలు లబ్ధి పొందినట్లు పత్రం ఇచ్చారు. అయితే తాము ఇంతవరకు వైద్యశాలకు వెళ్లలేదని, ఆరోగ్య శ్రీ ద్వారా చికిత్స చేయించుకోలేదని, అలాంటప్పుడు రూ.60 వేలు ఎటు వెళ్లాయని వారు ప్రశ్నిస్తున్నారు. అలాగే మరో బాలికకు ఒక్క సారి మాత్రమే అమ్మఒడి అందగా వలంటీర్లు ఇచ్చిన పత్రంలో రెండు సార్లు అందుకున్నట్లు ఉండటంతో వారు విస్తుపోతున్నారు. లబ్ధి అందుకోకపోయినా తప్పుడు పత్రాలతో వేలిముద్రలు వేయించుకోవడం ఏమిటని పలువురు వలంటీర్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సమరానికి సై

- బొప్పూడి వద్ద భారీ బహిరంగ సభకు భారీగా ఏర్పాట్లు
- సభా ప్రాంగణం నిర్మాణానికి భూమి పూజ చేసిన కూటమి నేతలు
- ఏర్పాట్లు పరిశీలించిన నారా లోకేశ్ కూటమి నేతలు

చిలకలూరిపేట, మార్చి13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జగన్ సర్కార్ అరాచక పాలనపై సమరం ప్రకటించి, చేతులు కలిపిన తెలుగుదేశం, జనసేన, బీజేపీ తొలి ఉమ్మడి బహిరంగ సభ చిలకలూరిపేట మండలం బొప్పూడి వద్ద భారీగా ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. సభా ప్రాంగణం నిర్మాణానికి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బీజేపీ, జనసేన నేతలతో కలసి బుధవారం ఉదయం 9.32 గంటలకు భూమిపూజ చేశారు. జాతీయ రహదారి పక్కనే బొప్పూడి వద్ద 17న భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ సభకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, తెలుగుదేశం అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్ కల్యాణ్ హాజరు కానున్నారు. సభకు జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న 200 ఎకరాల్లో ఏర్పాట్లు చేపట్టారు. ఈ ప్రాంతంలో రైతులు తమ భూములను స్వచ్ఛందంగా ఇచ్చారు. ఈ భూముల్లో ఉన్న పొగాకు తదితర పంటలకు సంబంధించి తెలుగుదేశం పార్టీ రైతులకు నష్టపరిహారం చెల్లిస్తుంది. రాష్ట్రంలోనే ఉమ్మడి తొలి సభ కావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి లక్షలాది మంది సభకు హాజరయ్యేలా ప్రణాళిక రూపొందించారు. ఇందుకు సంబంధించిన బాధ్యతలను ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లను అప్పగించారు. మరో మూడు రోజుల వ్యవధి మాత్రమే ఉండడంతో ఉమ్మడి గుంటూరు, ఉమ్మడి ప్రకాశం జిల్లాలో తీసుకున్న మూడు పార్టీలు సుమారు 15 లక్షల మంది జనసమీకరణకు ప్రణాళికలు రచించారు. ఈ బహిరంగ సభ వేదికగా దేశానికి ప్రధాని మోదీ, టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఒక సందేశం ఇవ్వబోతున్నారని కూటమి నేతలు పేర్కొన్నారు. దుర్మార్గపు ప్రభుత్వాన్ని సాగనంపడానికి, ప్రజలను కష్టాల నుంచి బయటపడటానికి, రైతులు సంతోషం, ఆడబిడ్డలు క్షేమం, యువతకు భవిష్యత్తు ఇవ్వడానికి ఈ బహిరంగ సభ దిక్సూచిలా ఉంటుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడు, మాజీ మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, కన్నా లక్ష్మీనారాయణ, ఆలపాటి రాజేంద్రప్రసాద్, నక్కా ఆనందబాబు, జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్, బీజేపీ నేతలు పాతూరి నాగభూషణం, డేగల ప్రభాకర్, కనపర్తి శ్రీనివాసరావు, యడ్లపాటి రఘునాథ్ బాబు, వల్లూరి జయప్రకాష్, లంకా దినకర్, శ్రీమన్నారాయణ, జనసేన పార్టీ కార్యక్రమాల నిర్వహణ విభాగం కన్వీనర్ కళ్యాణం శివ శ్రీనివాస్, ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల అధ్యక్షులు బండ్రెడ్డి రామకృష్ణ, గాదె వెంకటేశ్వరరావు, షేక్ రియాజ్, టీడీపీ ఎమ్మెల్యేలు గొట్టిపాటి రవికుమార్, నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్, మంతెన రామరాజు, పార్టీ సీనియర్ నేతలు జీవీ ఆంజనేయులు, పెందుర్తి వెంకటేష్, సత్యనారాయణరాజు, మూడు పార్టీల ముఖ్య నేతలు పాల్గొన్నారు.

నవ శకానికి దిక్సూచిలా సభ: మాజీ మంత్రి ప్రత్తిపాటి

బొప్పూడి వద్ద జరగబోయే సభతో చరిత్ర సృష్టిస్తామని మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఈ సభ వైపు దేశమంతా ఆసక్తిగా ఎదురు చూస్తోందన్నారు. ఎన్డీఏలో చేరిన తర్వాత తెలుగుదేశం- జనసేన- బీజేపీ ఆధ్వర్యంలో జరగబోతున్న తొలి ఉమ్మడి మేనిఫెస్టో సభ నభూతో నభవిష్యత్ అన్నట్టుగా ఉంటుందన్నారు. ఐదు కోట్ల ప్రజల ఆకాంక్షల మేరకే తెలుగుదేశం తిరిగి ఎన్డీఏలో భాగస్వామ్యమైందన్నారు. మూడు పార్టీలు కూటమిగా పోటీచేయడం రాష్ట్రాభివృద్ధికి కొత్తబాటలు వేస్తాయన్నారు. కేంద్ర సహకారం లేనిదే రాష్ట్రాభివృద్ధి సాధ్యం కాదని, రాష్ట్ర పునర్నిర్మాణం చేయాలంటే తెలుగుదేశం- జనసేన- బీజేపీ పార్టీలు కలవాల్సిన అవసరాన్ని ప్రజలు గుర్తించారని పుల్లారావు తెలిపారు. బీజేపీ సీనియర్ నేత పాతూరి నాగభూషణం మాట్లాడుతూ ఎటువంటి అభివృద్ధి చేయకుండా లక్షల కోట్ల అప్పులు చేసిన జగన్ ప్రభుత్వాన్ని గద్దెదింపడమే లక్ష్యంగా కూటమి పనిచేస్తుందన్నారు. జనసేన రాష్ట్రకార్యదర్శి కూడపాటి శివదర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ రియల్ ఎస్టేట్ బ్రోకర్ అవతారమెత్తి యథేచ్ఛగా దోపిడీగా పాల్పడుతున్నారు.



సభా వేదిక ఏర్పాటుకు సిద్ధం చేస్తున్న గడ్డర్లు





సభా ప్రాంగణంలో హెలిప్యాడ్ నిర్మాణం

తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీలు అప్రమత్తమయ్యాయి.

ఏర్పాట్లపై లోకేశ్ సమీక్ష

రాష్ట్ర చరిత్రలో ఈ సభ నిలిచిపోయేలా నిర్వహిస్తామని కూటమి నేతలు తెలిపారు. మూడు పార్టీల ముఖ్యనేతలతో ఏర్పాట్లపై లోకేష్ చర్చించారు. సభా ప్రాంగణానికి సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు. సభా వేదిక, గ్యాలరీలు, హెలిప్యాడ్‌లు తదితర ఏర్పాట్లపై లోకేశ్ నేతలతో చర్చించారు. లక్షలాదిగా ప్రజలు రానున్న సందర్భంగా వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచన చేశారు. సభా ప్రాంగణం వద్ద ప్రారంభమైన పనుల ను వేగంగా పూర్తిచేయాలని సూచించారు. బీజేపీ పొత్తు కుదిరిన తర్వాత నిర్వహిస్తున్న మొదటి సభను ప్రతిష్ఠాత్మకంగా

సమావేశానికి రావాల్సిందే..

- సచివాలయ సెక్రటరీలకు రజని అనుచరుల ఫోన్లు
- రాకపోతే అధికారంలోకి వచ్చాక సంగతి చూస్తామని బెదిరింపులు

గుంటూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఇప్పటికే వివిధ వర్గాలకు స్టార్ హోటల్స్‌లో ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేసి మద్దతు కోరుతున్న వైసీపీ గుంటూరు పశ్చిమ అభ్యర్థి, మంత్రి విడదల రజిని గురువారం మరో గెట్ టూ గెదర్ కార్యక్రమానికి ఏర్పాట్లు చేశారు. రింగురోడ్డులోని స్టార్ హోటల్‌కు నియోజకవర్గ పరిధిలోని సచివాలయాల సెక్రటరీలందరినీ హాజరు కావాల్సిందిగా ఆమె అనుచరుల నుంచి బుధవారం ఫోన్ కాల్స్ మోగాయి. అలానే ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి వెంకటరామిరెడ్డి అసోసియేషన్‌కు చెందిన నాయకులు కూడా ఫోన్లు చేసి ఆత్మీయ సమావేశానికి హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు కొంతమంది తాము రాలేమని సమాధానం ఇవ్వగా రేపు అధికారంలోకి వచ్చేది మేమే.. అప్పుడు మీ సంగతి చూస్తామని బెదిరించినట్లు సచివాలయాల సెక్రటరీలు చర్చించుకుంటున్నారు. మంత్రి విడదల రజని ఇప్పటికే ఉపాధ్యాయ సంఘాల నాయకులు, వారి అసోసియేషన్ల కింద ఉన్న ఉపాధ్యాయులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. దీనిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు వెళ్లాయి. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకుడు వెంకటరామిరెడ్డి పైనా టీడీపీ రాష్ట్ర నాయకత్వం సీఈవో ముకేష్‌కుమార్ మీనాకు ఫిర్యాదు చేసింది. అయినా అవేమి పట్టించుకోకుండా ఇప్పుడు సచివాలయాల సెక్రటరీలను తమ ఆత్మీయ సమావేశానికి రావాలని ఒత్తిడి చేస్తున్నారు. ఇందుకోసం ఒక్కొక్కరికి రూ.2 వేల విలువ చేసే గిఫ్టుహ్యాంపర్‌లు కూడా సిద్ధం చేసినట్లు సమాచారం ఇచ్చారు. కాగా గుంటూరు పశ్చిమలో బీఎల్‌వోలపై కుప్పలు తెప్పలుగా ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు వెళ్లాయి. ఎన్నికల కోడ్ అమలులోకి రాగానే వాటిపై చర్యలు తీసుకునే అవకాశం లేకపోలేదు. ఈ పరిస్థితుల్లో తమని సమావేశానికి రమ్మని ఒత్తిడి చేయడం ఎంతవరకు సబబని సెక్రటరీలు మథనపడుతున్నారు. దాదాపుగా 150 మంది సచివాలయాల సెక్రటరీలు ఈ కార్యక్రమానికి హాజరయ్యేలా చూసేందుకు వెంకటరామిరెడ్డి అసోసియేషన్ నాయకులు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

మేయర్ పదవి ఎరగా..?

- మనోహర్‌ను చిలకలూరిపేటకు పంపడంలో మర్మమేమి?
- ఆయనపై సొంత పార్టీలోనే వ్యతిరేకత..
- కర్నూలు తరహా వ్యూహం గుంటూరులో అమలుకు సన్నాహాలు
- తూర్పులో మరొకరికి మేయర్ పదవి ఎర
- మేయరు రేసులో డిప్యూటీ మేయర్ సజీల, కార్పొరేటర్ అరుణకుమారి

గుంటూరు, మార్చి13(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడును చిలకలూరిపేట వైసీపీ అభ్యర్థిగా ఎంపికచేసి ఆ నియోజకవర్గానికి సమన్వయకర్తగా నియమిస్తూ మంగళవారం సీఎం జగన్ ఆదేశాలు జారీచేసిన విషయం తెలిసిందే. మంత్రి రజని తాను ప్రాతినిధ్యం వహిస్తున్న చిలకలూరిపేట నియోజకవర్గంలో తిరిగి వైసీపీకి విజయావకాశాలు లేవని భావించే ఆ నియోజకవర్గాన్ని వీడి ఆమె గుంటూరు పశ్చిమకు వలస వచ్చిన తెలిసిందే. ఆమెకు బదులుగా అదే నియోజకవర్గానికి చెందిన మల్లెల రాజేష్‌నాయుడును తొలుత ఎంపిక చేశారు. అతనికి కూడా గెలుపు అవకాశాలు లేవని భావించటంతో పాటు మంత్రి రజనితో విభేదాలు రావటంతో అతన్ని కూడా తప్పించేశారు. అతని స్థానంలో మనోహర్‌కు అవకాశం కల్పించినప్పటికీ ఇదంతా జగన్ వ్యూహంలో భాగమేనని వైసీపీలో చర్చ జరుగుతోంది. మేయర్ పదవిలో కొనసాగుతున్న మనోహర్ తరచూ అనేక ఆరోపణలు ఎదుర్కోవటంతో పాటు సొంత పార్టీ నేతల్లో కూడా వ్యతిరేకత తెచ్చుకున్నారు. ముఖ్యంగా తూర్పు ఎమ్మెల్యే ఎండీ ముస్తఫా కూడా మనోహర్‌ను వ్యతిరేకించారు. ఒక దశలో వైసీపీ కార్పొరేటర్లతో ముస్తఫా రహస్య సమావేశం ఏర్పాటు చేసి మనోహర్‌ను మేయర్ పదవి నుంచి దించే యోచన చేశారు. అయితే అధిష్ఠానం అడ్డుపడటంతో అది ముందుకు వెళ్లలేదు.

ఇదిలా ఉండగా సిట్టింగ్ ఎమ్మెల్యే ముస్తఫాపై తీవ్ర వ్యతిరేకత సొంత పార్టీలోనే నెలకొంది. అతనికి తిరిగి సీటిస్తే ఓడిస్తామని కూడా బహిరంగంగా ఆ పార్టీ నేతలు వ్యక్తపరిచారు. అతనికి బదులు తమకు సీటు ఇవ్వాలని పలువురు పోటీపడ్డారు. ముఖ్యంగా వైసీపీ సీనియర్ నేత షౌకత్ కుమార్తె, డిప్యూటీ మేయర్ షేక్ సజీల ఈ పర్యాయం సీటు తనకే వస్తుందని ఎంతో ఆశపడ్డారు. పార్టీ కార్యక్రమాల్లో కూడా ఎంతో చురుగ్గా పాల్గొనేది. సీఎం జగన్ కూడా ఒక దశలో ఆమె అభ్యర్థిత్వానికే మొగ్గు చూపారు. అయితే ఆర్థిక పరిస్థితులు సాకుగా చూపి తిరిగి ముస్తఫా కుమార్తె నూరిఫాతిమాకు సీటిస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిర్ణయాన్ని తూర్పు నియోజకవర్గంలోని వైసీపీ శ్రేణులు ముఖ్యంగా ముస్లిం సామాజికవర్గానికి చెందిన ఇప్పటికీ వ్యతిరేకిస్తున్నారు. తీవ్ర అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న సిట్టింగ్ ఎమ్మెల్యే కుటుంబీకులకే అది కూడా మహిళకు సీటిస్తే ఉపయోగమేమిటని, ఆమె గెలిచినా పెత్తనం ఆయనే చేస్తారుగా అని మండిపడుతున్నారు. ముఖ్యంగా సీటు ఆశించి భంగపడ్డ షౌకత్ తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నాడు. అతని కుమార్తె, డిప్యూటీ మేయర్ సజీల కూడా గతంలోలా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనటం లేదు. దీంతో ఆమెను కూడా ఊరడించి ముస్తఫా కుమార్తె నూరిఫాతిమా విజయావకాశాలను మెరుగు పరచాలని ముఖ్యమంత్రి జగన్ యోచన చేయటం వల్లే మనోహర్‌కు ఎమ్మెల్యే అభ్యర్థిగా పదోన్నతి కల్పించినట్టు విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. ఇటీవల కర్నూలులో కూడా మేయర్ అభ్యర్థిగా ఉన్న బీవై రామయ్యను కర్నూలు ఎంపీగా పంపి ఆయన స్థానంలో కార్పొరేటర్ సత్యనారాయణమ్మకు మేయర్‌గా పదోన్నతి కల్పించారు. అదే తరహాలో డిప్యూటీ మేయర్ సజీలకు మేయర్ పీఠం దక్కటం ఖాయమని ప్రముఖంగా వినిపిస్తోంది. ఆమె కాకుంటే ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం భార్య కార్పొరేటర్ అరుణకుమారి పేరును కూడా జగన్ పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు. ఈమెకు అవకాశం కల్పించి బీసీ సామాజిక వర్గాన్ని ఆకట్టుకునే ఆలోచన చేస్తున్నారని అంటున్నారు.

వాస్తవానికి ఆ రోజున మనోహర్‌ను రెండున్నరేళ్ళ పదవికే మేయర్‌గా ఎంపిక చేయటం జరిగింది. చివరి రెండున్నరేళ్ళు పాదర్తి రమేష్‌గాంధీకి అవకాశం కల్పించాలని సీఎం జగన్ నిర్ణయించారు. అయితే అనుకోకుండా రమేష్‌గాంధీ కరోనాబారిన పడి మరణించటంతో ఆ అంశం తెరమరుగైపోయింది. ఐదేళ్ళ పాటు మనోహరే మేయర్‌గా కొనసాగే అవకాశం వచ్చింది. మరి ఇప్పుడు కర్నూలు వ్యూహంకు మనోహర్ అంగీకరిస్తాడో లేదో చూడాలి.



రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సాయంత్రం) 6.23(గురువారం)
సహరీ (ఉదయం) 5.00 (శుక్రవారం)



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

టీడీపీకి మద్దతుగా నిలవండి

● అన్ని విధాల అండగా ఉంటా.. మాజీ ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, మార్చి13: గురజాల నియోజకవర్గంలో ముదిరాజ్ సామాజిక వర్గంతో పాటు రజకులు, వడ్డెర సామాజికవర్గం కూడా టీడీపీకి, తనకు వెన్నంటే ఉన్నారన్న విషయాన్ని గుర్తుచేస్తూ రేపటి అధికారంలోకి వచ్చాక వారికి అన్నివిధాల అండగా వుంటామని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం స్థానికంగా ముదిరాజ్‌ల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో దాచేపల్లిలో ఎకరం స్థలం కేటాయించామని, పిడుగురాళ్లలో 85 సెంట్లు కేటాయించిన విషయాన్ని గుర్తుచేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక పిడుగురాళ్లలో 85 సెంట్లు ఆక్రమణలకు పాల్పడ్డారని తెలిపారు. రేపటి ఎన్నికల్లో టీడీపీ కచ్చితంగా అధికారంలోకి వస్తుంది. దాచేపల్లి, పిడుగురాళ్లలోనే కాకుండా అవసరమైన చోట కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి తోడ్పాటునందిస్తానని అన్నారు. అదేవిధంగా చదువుకున్న యువతకు యూత్ పాలసీ ద్వారా స్వయం ఉపాధి పథకాలను ప్రవేశపెడతామన్నారు. సూపర్‌సిక్స్ పథకాలతోపాటు గురజాల నియోజకవర్గంలో తాను సొంతంగా తీసుకురానున్న సూపర్ సిక్స్ పథకాలతో ప్రతి ఒక్కరు లబ్ధి పొందుతారన్నారు. మట్టపల్లి లక్ష్మీనర సింహస్వామి దేవాలయం ముదిరాజుల సత్రంలో వంటసామగ్రి కొనుగోలుకు రూ.16 వేలకు పైగా నగదును అందజేసిన యరపతినేని శ్రీనివాసరావును ఈ సందర్భంగా సంఘ సభ్యులు సత్కరించారు. సమావేశంలో రొండి శేషయ్య, కారుకోళ్ల నాగరాజు, గొర్రె హనుమంతరావు, రాజేంద్రప్రసాద్, ఎం.శివ, ఎన్.నరసింహారావు, బి.శ్రీనివాసరావు, ఎం.గోవింద రాజు తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్ దారుణ హత్య

నకరికల్లు, మార్చి 13 : నకరికల్లు మండలం చల్లగుండ్ల శివారు సున్నం బట్టీ సమీపంలో గల దాబాలో రైడీషీటర్‌ను మూడు ద్విచక్ర వాహనాలపై వచ్చిన ఆరుగురు వ్యక్తులు కత్తులు, మారణాయుధాతో బుధవారం రాత్రి నరికి చంపారు. సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం.రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం రొంపిచర్ల మండలం విప్పర్ల గ్రామానికి చెందిన చెరవల్లి మణికంఠ (27) వృద్ధురాలిపై అత్యాచారం చేసి హత్యచేసిన కేసులో నిందితుడిగా ఉన్నాడు. దొంగతనం కేసుల్లోనూ మణికంఠ నిందితుడిగా ఉన్నాడు. రొంపిచర్ల పోలీస్‌స్టేషన్‌లో మణికంఠపై రౌడీషీట్ నమోదైంది. బుధవారం రాత్రి మణికంఠ సున్నం బట్టీ సమీపాన గల ఓ దాబాలో టిఫన్ చేసేందుకు రాగా ప్రత్యర్థులు మూడు ద్విచక్ర వాహనాలపై ఆరుగురు వచ్చి కత్తులు, మారణాయుధాలతో మణికంఠను హత్యచేశారు. ఒక మహిళతో వివాహేతర సంబంధమే ఈ హత్యకు కారణంగా పోలీసులు ప్రాథమికంగా తెలిపారు. సత్తెనపల్లి డీఎస్పీ గురునాథ్, నకరికల్లు ఎస్ఐ వి.రాంబాబు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఇప్పుడు తలెత్తుకుని జీవిస్తున్నాం..

● రోడ్డు మీద చెత్త ఏరుకొంటూ జీవించే వాళ్లం
● స్వచ్ఛత ఉద్యమి యోజన ద్వారా లబ్ధి పొందాం
● ప్రధానితో ముఖాముఖీగా మాట్లాడిన ఆదిపూడి ముత్తమ్మ



వర్చువల్ విధానంలో మాట్లాడుతున్న ప్రధాని మోదీ



ప్రధాని తో మాట్లాడుతున్న లబ్ధిదారు ముత్తమ్మ

గుంటూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సార్... మా కుటుంబ సభ్యులు రోడ్డు మీద చెత్త ఏరుకొని బతికేవాళ్లం. రోడ్డు మార్జిన్‌లో ఎండనక వాననక నాభర్త, ఇద్దరు పిల్లలతో జీవించాను. స్వచ్ఛత ఉద్యమి యోజన పథకం ద్వారా లబ్ధి పొంది ఇక్కడకు వచ్చి మాట్లాడే స్థాయికి వచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది అని కాకుమానువారి తోటకు చెందిన ఆదిపూడి ముత్తమ్మ వర్చువల్ విధానంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో మాట్లాడుతూ భావోద్వేగానికి లోనయ్యారు. బుధవారం భారత ప్రధాని నరేంద్ర మోదీ న్యూఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వెనుకబడిన తరగతుల ఔట్ రీచ్ కార్యక్రమంలో ముత్తమ్మతో ముఖాముఖిగా సంభాషించారు. ముత్తమ్మ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ స్వచ్ఛత ఉద్యమీ యోజన పథకం ద్వారా డీసిల్టింగ్ వాహనం (సెప్టిక్ ట్యాంక్)కు ఎంపికవ్వటంతో చాలా సంతోషం వచ్చిందన్నారు. సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ అందించిన తరువాత నా ఇద్దరు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించుకుంటున్నాని తెలిపారు. నేను డ్రైవింగ్ నేర్చుకొని సెప్టిక్ ట్యాంక్ వాహనాన్ని స్వయంగా నడుపుకుంటూ మరింతగా వృద్ధి చెందుతానన్నారు. నెలకు రూ.10 వేలు ఆదాయం పొందుతున్నానని తన సంతోషాన్ని ప్రధానితో పంచుకొన్నారు. .

తొలుత గౌరవ ప్రధాన మంత్రి పీఎం సూరజ్ జాతీయ పోర్టల్‌ను, అణగారిన వర్గాలు ఎస్సీ, ఓబీసీ, సఫాయి కర్మచారీలకు రుణాల మంజూరు పథకాన్ని, పారిశుద్ధ్య కార్మికులు, సెప్టిక్ ట్యాంక్ వర్కర్లకు ఆయుష్మాన్ హెల్త్ కార్డులు, పీపీఈ కిట్ల పంపిణీని రిమోట్ ద్వారా లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ లబ్ధిదారు ఆదిపూడి ముత్తమ్మతో మాట్లాడుతూ మరో ఐదు ఏళ్లలో వెనుకబడిన, పేదవారి అభ్యున్నతికి మరిన్ని పథకాలు విస్తృత స్థాయిలో అందించడం జరుగుతుందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ గంధం చంద్రుడు, సాంఘిక సంక్షేమ శాఖ సెక్రటరీ హర్షవర్ధన్, సామాజిక న్యాయ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు జూపూడి ప్రభాకర్, ఎన్ఎస్ఎఫ్డీసీ - స్త్రీనిధి రుణాలు, పీఎం-సూరజ్ యూఎస్వై పథకం ద్వారా 218మంది డ్వాక్రా సంఘాలకు మంజూరు చేసిన రూ.1,33,51,900 చెక్కును, పారిశుధ్య కార్మికులు, సెప్టిక్‌ట్యాంక్ వర్కర్లకు ఆయుష్మాన్ హెల్త్ కార్డులు, పీపీఈ కిట్ లను పంపిణీ చేశారు.

కార్యక్రమంలో ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, మినిస్టర్ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్మెంట్ డీజీఎం సపన్ బారువా, రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం, విభిన్న ప్రతిభావంతుల సహాయక కార్పొరేషన్ చైర్మన్ ముంతాజ్ పఠాన్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు మధుసూదన రావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ప్రేమకుమారి, డీఆర్డీఏ పీడీ హరిహర నాథ్, ఎన్ఎస్ కెఎఫ్ డీసీ డిప్యూటీ మేనేజరు సందీప్ గుప్తా, ఎన్ఐ ఎస్‌డీఎఫ్‌సీపీఎంయులు సౌజన్య, మహిమ, ఎన్సీసీ ఎఫ్‌డీసీ, ఎన్ఎస్ ఎఫ్డీసీ, నమస్తే లబ్ధిదారుల, సెప్టిక్ ట్యాంక్ కార్మికులు పాల్గొన్నారు.



పీఎం సూరజ్ యూఎస్‌వై పథకం చెక్కు విడుదల చేస్తున్న కలెక్టర్ తదితరులు

మాజీ సీఎం రోశయ్య ఇప్పుడే గుర్తుకొచ్చారా?

● ఆ సామాజికవర్గ ఓట్ల కోసమే ఆగమేఘాలపై విగ్రహం..
● నరసరావుపేట టీడీపీ ఎంపీ అభ్యర్థి శ్రీకృష్ణదేవరాయలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి శ్రీకృష్ణదేవరాయలు

వినుకొండ, మార్చి 13: వైసీపీ నాయకులకు ఐదేళ్ళుగా గుర్తుకు రాని మాజీ సీఎం రోశయ్య ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఇప్పుడు గుర్తుకొచ్చారా అని నర్సరావుపేట పార్లమెంట్ టీడీపీ ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. పట్టణంలోని గంగినేని కళ్యాణ మండపంలో టీడీపీ విస్తృతస్థాయి సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ రోశయ్య సామాజిక వర్గం ఓట్ల కోసమే రెండ్రోజుల్లోనే ఆగమేఘాలపై ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, కానీ అదే సామాజిక వర్గానికి ఎమ్మెల్యే బొల్లా ఏమి చేశారో చెప్పాలన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే వరికపూడిశెల ప్రాజెక్టును పూర్తి చేసి పల్నాడు వాటర్‌గ్రిడ్ ద్వారా ప్రతి ఇంటికీ తాగు నీరందించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. తొడలు గొట్టే సంస్కృతి తమది కాదని, అభివృద్ధే మా ధ్యేయమన్నారు. గడిచిన ఐదేళ్ళలో తాను ఎంపీగా ఎవరినీ విమర్శించలేదని, పల్నాడు అభివృద్ధి కోసమే పాటుపడ్డానన్నారు. రాష్ట్రంలో ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన అటవీశాఖ అనుమతులను ఎమ్మెల్యే తీసుకొస్తాడా, ఎంపీ తీసుకొస్తాడో తెలుసుకోవాలని బొల్లాను ఉద్దేశించి అన్నారు. రాష్ట్రంలో మూడు మెడికల్ కాలేజీలకు అనుమతులు రాగా ఒకటి పల్నాడు జిల్లాకు తీసుకొచ్చానని తెలిపారు. పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు మాట్లాడుతూ ఎమ్మెల్యే బొల్లాకు వినుకొండ నియోజకవర్గ ప్రజలు రానున్న ఎన్నికలలో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. పంటకు గిట్టుబాటు ధర అడిగినందుకు రైతును చెప్పుతో కొట్టబోవడమే కాక జైలులో పెట్టించిన దుర్మార్గుడు బ్రహ్మనాయుడని అన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీకూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తాయని, వరికపూడిశెల ప్రాజెక్టును పూర్తి చేసి ప్రతి ఇంటికి తాగునీరిచ్చి, రైతులకు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర నాయకులు నిశ్శంకర శ్రీనివాసరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కుటుంబం ఆత్మహత్యాయత్నం

● భార్య మృతి, భర్త, కుమార్తెల పరిస్థితి విషమం

తెనాలి, మారీసుపేట మార్చి 13: ఒక పక్క చేసిన అప్పులు తీర్చలేక.. మరో పక్క కుమార్తె కాపురం చక్కదిద్దలేక తీవ్ర మనోవేదనకు గురై ఓ కుటుంబం ఆత్మహత్యకు యత్నించిన ఘటన తెనాలిలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఈ ఘటనలో భార్య మృతి చెందగా భర్త, కుమార్తెల పరిస్థితి విషమంగా ఉంది. ఇందుకు సంబంధించిన వివరాలు.. స్థానిక నాజరుపేటకు చెందిన విష్ణుమొలకల శివశంకర్రావు, భార్య నాగమణి(45), కుమార్తె హారికలు నివాసం ఉంటున్నారు. పాల వ్యాపారం చేసిన శివశంకర్రావు అది లాభసాటిగా లేకపోవడంతో స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులో చిన్న కొట్టు తీసుకుని టీ వ్యాపారాన్ని నిర్వహిస్తు కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. కుమార్తెకు తెనాలికి చెందిన వ్యక్తితో ఘనంగా పెళ్లి చేశారు. అయితే కొంత కాలంగా కుమార్తె కాపురంలో కట్నం కోసం వేధింపులు చోటు చేసుకున్నాయి. దానికి తోడు వివాహానికి కట్నకానుకల కోసం చేసిన అప్పులు పెరిగి, వారి నుంచి ఒత్తిడి కూడా ప్రారంభమైంది. అదనపు కట్నం కోసం తీసుకు రాలేదని అల్లుడు, అతడి కుటుంబసభ్యులు తమ కుమార్తెను ఇంటికి పంపించకుండా మానసికంగా, శారీరకంగా చిత్రహింసలు గురి చేస్తున్నారు. దీంతో శివశంకర్రావు తన కుమార్తెను ఇంటికి తీసుకు వచ్చారు. వరకట్న వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. అయితే ఆరు నెలలుగా కుమార్తె పుట్టింట్లోనే ఉంటున్నది. అదనపు కట్నం తెస్తేనే కాపురానికి రావాలని మధ్యవర్తితో అల్లుడు ఒత్తిడి పెంచడం ప్రారంభించాడు. ఒక పక్క చేసిన అప్పులు తీర్చలేక మరో పక్క కుమార్తె కాపురం చక్కదిద్దలేక తీవ్ర మనోవేదనకు గురైన శివశంకర్రావు కుటుంబసభ్యులతో కలసి ఆత్మహత్యకు సిద్ధమయ్యారు. మంగళవారం అర్ధరాత్రి ముగ్గురూ గుళికలనుతిన్నారు. గమనించిన బంధువులు వారిని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నాగమణి(45) మృతి చెందదింది. శివశంకర్రావు, హారికల పరిస్థితి విషమంగా ఉన్నది.

పోలీసుల నిర్లక్ష్యమే కారణం : నాగమణి సోదరుడు

బావ, అక్క కుటుంబం ఆత్మహత్యాయత్నానికి పోలీసుల నిర్లక్ష్యమే కారణమని నాగమణి సోదరుడు శీలం రాజా ఆరోపించారు. తమ అక్క కుటుంబం ఆత్మహత్యకు కారకులైన వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని శిక్షించాలన్నారు. మరొకరి కుటుంబానికి ఇలా జరగకుండా చూడాలని కోరారు. అయితే పోలీసులు మాట్లాడుతూ ఇరు కుటుంబాల వారు పరస్పరం కేసులు నమోదు చేసుకున్నారని ప్రస్తుతం కోర్టులో ఉన్నాయన్నారు.

హనుమంతుడి విగ్రహం

అత్యంత పురాతనం

నకరికల్లు, మార్చి 13: పల్నాడు జిల్లా నకరికల్లు మండలం రూపెనగుంట్ల గ్రామంలో ఉన్న హనుమంతుని విగ్రహం 1591లో ప్రతిష్ఠించినట్టు పురావస్తు పరిశోధకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి వివరించారు. భరద్వాజ గోత్రానికి చెందిన కొత్తపల్లి రాఘవయ్య కుమారుడు తిమ్మాజి హనుమంతుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్టు శాసనం ద్వారా తెలుస్తుందన్నారు. ఆ నాటి హనుమంత స్వామే నేడు రూపెనగుంట్ల వీరాంజనేయ స్వామిగా భక్తులు పూజిస్తున్నారు.

బ్లాక్‌మెయిల్ చేస్తున్న బీజేపీ

● కేంద్రం కనుసన్నల్లోనే చంద్రబాబుకు జైలు
● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

వినుకొండటౌన్, గుంటూరు(తూర్పు), మార్చి13: కేంద్రం కనుసన్నల్లోనే సీఎం జగన్మోహన్‌రెడ్డి టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడును ఎటువంటి ఆధారాలు లేకుండా 53 రోజులు జైలులో ఉంచారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆరోపించారు. పట్టణంలోని కారంపూడి రోడ్డులోని పంక్షన్ హాల్‌లో పల్నాడు జిల్లా సీపీఐ కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రం బెదిరింపు ధోరణితో దేశంలోనే వివిధ రాజకీయపార్టీలను ఎన్డీఏలోకి చేర్చుకుంటుందని ఆరోపించారు. తెలంగాణలో టీడీపీ పోటీ చేయడాన్ని బీజేపీ అడ్డుకుందని, పార్టీలను బ్లాక్‌మెయిల్ చేసి నితీష్‌కుమార్‌తోపాటు అశోక్‌చోహాన్ వంటి నాయకులను సైతం బీజేపీలో చేర్చుకొని తాయిళాలు ప్రకటిస్తుందన్నారు. ఆమ్‌ఆద్మీ పార్టీని కూడా బెదిరింపు ధోరణితో తన దారిలో తెచ్చుకునేందుకు లిక్కర్ కేసు పేరుతో బెదిరిస్తున్నారన్నారు. జగన్ తాడేపల్లి ప్యాలెస్ నుంచి లిక్కర్ మాఫియా కొనసాగిస్తున్నా ఏం చర్యలు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. చంద్రబాబుకు ఇష్టం లేకపోయిన పొత్తుతో పనిచేసేందుకు సీట్ల పంపకం కూడా జరిగిందన్నారు. ప్రతిపక్ష పార్టీ టీడీపీ, జనసేనతోపాటు ఇతర ప్రజా సంఘాలతో కలిసి రాష్ట్రంలోని సమస్యలపై పోరాటాలు చేశామన్నారు. ఇండియా కూటమితో కలిసి ఎన్నికల్లో పోటీచేస్తున్నామని అన్నారు. సీపీఐ సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లడుతూ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పోలీసులు రాజ్యం నడుస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ పల్నాడుజిల్లా కార్యదర్శి మారుతివరప్రసాద్, సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, సంద్రపాటి సైదా, బూదాల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు కొత్తపేట సీపీఐ కార్యాలయంలో బుధవారం జరిగిన జిల్లా సాధారణ సమావేశానికి రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మరోసారి మోదీ అధికారంలోకివస్తే అంబేద్కర్ రాజ్యాంగాన్ని పక్కన పెట్టి దేశంలో మనుస్మృతిని ప్రవేశపెడతాడని, పొత్తుల విషయంలో ప్రాంతీయ పార్టీలు పునరాలోచన చేయాలని కోరారు. మతాల మధ్య చిచ్చుపెట్టే సీఏఏ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జంగాల అజయ్ కుమార్, కోటా మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు బేఖాతరు

● ప్రభుత్వ కార్యాలయాలు ప్రారంభించిన వైసీపీ నేత



సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న వైసీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

పొన్నూరుటౌన్, మార్చి13: పొన్నూరు నియోజకవర్గంలో వైసీపీ నాయకులకు ప్రభుత్వ కార్యాలయాలు, పార్టీ వేదికలుగా మారుతున్నాయి. మండలంలోని సీతారామపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్‌ను బుధవారం నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ప్రారంభించటం వివాదస్పదమైంది. స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య గుంటూరు పార్లమెంట్ సమన్వయకర్తగా వెళ్లిన నాటి నుంచి పొన్నూరు నియోజకవర్గంలో అధికార యంత్రాంగం మొత్తం అంబటి మురళీకృష్ణ వెంట నడుస్తుందనే విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వ కార్యాక్రమంగా నిర్వహించాల్సిన సచివాలయ ప్రారంభం వైసీపీ కార్యక్రమంగా నిర్వహించటం పట్ల ప్రజలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతుంది. సీతరామపురం గ్రామంలో తెలుగుదేశం పార్టీ బలపరిచిన సర్పంచ్‌ను సైతం ఈ ప్రారంభ కార్యక్రమానికి అధికారులు దూరం పెట్టారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.33 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00



నృసింహాలయంలో పూజలు నిర్వహించిన శివస్వామి

కూటమి విజయాన్ని కాంక్షిస్తూ..

విజయ శంఖారావ యాత్ర

● శైవక్షేత్రం పీఠాధిపతి శివస్వామి వెల్లడి..
● లక్ష్మీనృసింహ స్వామి,రాజ్యలక్ష్మీ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

మంగళగిరి సిటీ, మార్చి 13: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి విజయం సాధించాలని కోరుకుంటూ విజయ శంఖారావం పేరిట యాత్ర నిర్వహిస్తున్నట్టు శైవక్షేత్రం పీఠాధిపతి శివస్వామి తెలిపారు. ఈ యాత్రలో భాగంగా బుధవారం ఉదయం ఆయన మఠ పీఠాధిపతులతో కలిసి మంగళాద్రి క్షేత్రాన్ని దర్శించారు. దిగువ సన్నిధిలోని శ్రీలక్ష్మీనృసింహ స్వామి, శ్రీరాజ్యలక్ష్మీ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శివస్వామి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో అయోధ్యలో బాలరాముడి దివ్య ప్రతిష్ఠతో భారతీయుల్లో చైతన్యం వెల్లివిరుస్తోందన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ 375నుంచి 400 పార్లమెంటు స్థానాలను కైవసం చేసుకోవాలని, ఏపీలో బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి ఘనవిజయం సాధించాలని, మంగళగిరిలో ఉమ్మడి అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న నారా లోకేశ్ భారీ ఆధిక్యంతో గెలుపొందాలని స్వామివారిని వేడుకున్నట్టు చెప్పారు. ఈ మేరకు విశ్వధర్మ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో విజయ శంఖారావ యాత్రను చేపట్టినట్టు తెలిపారు. తొలిదశలో తెనాలి రోడ్డులోని వరసిద్ధి గణపతి, విజయవాడ కనకదుర్గమ్మ, మంగళగిరి నృసింహస్వామి, రాజధాని రైతుల శిబిరాన్ని సందర్శించినట్టు తెలిపారు. రెండో విడతలో శుక్రవారం నుంచి గుంటూరు బృందావన గార్డెన్స్‌లోని వేంకటేశ్వరస్వామి, త్రిపురాంతకంలోని బాలాత్రిపుర సుందరీదేవి, శ్రీశైలం మల్లన్న క్షేత్రాలను దర్శిస్తామన్నారు. కార్యక్రమంలో తమ్మిశెట్టి జానకీదేవి, మాజేటి సూర్యవేణుగోపాలకృష్ణ, శైవ క్షేత్రం మఠ పీఠాధిపతులు పాల్గొన్నారు.



మందడం ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్నరైతులు

అమరావతే ఆంధ్రుల రాజధాని

● 1548వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్లూరు మార్చి 13: అమరావతే ఐదు కోట్ల మంది తెలుగు ప్రజల రాజధాని అని, మూడు రాజధానులనే ఆలోచనను సీఎం జగన్‌రెడ్డి మానుకోవాలని రాజధాని అమరావతికి 33 వేల ఎకరాలు త్యాగంచేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతుకూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు బుధవారం నాటికి 1548వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. అమరావతి రాజధాని నిర్మాణ పనులు పూర్తిచేసి ఉంటే యువత బయట రాష్ట్రాలకు, దేశాలకు వెళ్ళి ఉద్యోగాలు చేయాల్సి వచ్చేది కాదని, వందల కంపెనీలు అమరావతిలో ఉండి ఇక్కడ యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొంది ఉండేవారని అన్నారు. కేంద్రరంగ సంస్థలకు రాజధాని అమరావతిలో స్థలాలు కేటాయించి ఉండగా, వాటి నిర్మా ణానికి వైసీపీ ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించికపోవటంతో అభివృద్ధికి నోచుకోలేదన్నారు. సీఎం అమరావతిపై కక్ష ఎందుకు పెంచుకున్నారో తమకు అర్థం కావటం లేదన్నారు. మూడు ముక్కల ఆటతో రాష్ట్ర భవిషత్ ఆశాజనకంగా ఉండదన్నారు. అమరావతితోనే ఉజ్వల భవిషత్ అన్నారు. కాని జగన్‌రెడ్డి డిక్షనరీలో అభివృద్ధి అనే పదం లేనేలేదన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. రాజధాని 29 గ్రామాలతో పాటు, తాడికొండ, మంగళగిరి నియోజకవర్గాలలో ఆందోళనలు కొనసాగాయి.

'యువత మేలుకో - చంద్రన్నను ఎన్నుకో' లఘుచిత్రం ఆవిష్కరణ

తుళ్లూరు గ్రామానికి చెందిన తరిగోపుల హరీష్ రూపొందించిన 'యువత మేలుకో -చంద్రన్నను ఎన్నుకో..' అనే లఘుచిత్రాన్ని బుధవారం తుళ్లూరు రైతు ధర్నా శిబిరంలో రైతు జేఏసీ నేత పువ్వాడ సుధాకరరావు ఆవిష్కరించారు. టీడీపీఫోరం సింగపూర్(ఐటీ) ఎంప్లాయిస్ ఈ లఘుచిత్రాన్ని నిర్మించారు. ఈసందర్భంగా సుధాకరరావు మాట్లాడుతూ 'అరాచకాన్ని అంతం చేద్దాం.. అభివృద్దిని ఎన్నుకుందాం' అనే నినాదంతో ఈ లఘుచిత్రాన్ని నిర్మించామన్నారు. హరీష్ మాట్లాడుతూ షోషల్ మీడియా ఛానెల్స్‌లో మంగళవారం ఈ చిత్రాన్ని రిలీజ్ చేయగా 24గంటల్లోనే లక్ష మంది యూ ట్యూబ్‌లో చూశారని తెలిపారు. కార్యక్రమంలో మహిళలు, రైతులు, జేఏసీ నేతలు కాటా అప్పారావు పాల్గొని చిత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు.

1,41,742 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,20,628 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,41,742 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 85,744 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	19500
నెంబరు. 5	10000	17000
273	11000	14500
341	9500	19000
4884	9000	14000
సూపర్ 10	11500	15000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	20500
బ్యాడిగి	9000	19000
దేవనూరు డీలక్స్	10000	20500
తెల్లకాయలు	5000	12500

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



విభిన్న ప్రతిభావంతుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న పెమ్మసాని

దివ్యాంగులకు అండగా ఉంటా

● టీడీపీ గుంటూరు పార్లమెంటు అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు అన్నివిధాలా అండగా ఉంటానని, దివ్యాంగుల సమస్యలపై పార్లమెంటు వేదికగా తన గళం వినిపిస్తానని టీడీపీ గుంటూరు పార్లమెంటు అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ హామీ ఇచ్చారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం పెమ్మసానితో రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల సహాయసంస్థ మాజీచైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అధ్యక్షతన గుంటూరుజిల్లా దివ్యంగుల విభాగం ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పెమ్మసాని మాట్లాడుతూ.. శారీరక వైఫల్యం మనిషికి శాపంగా మారకూడదని, విభిన్న ప్రతిభావంతులు వారికున్న శారీరక సమస్యలను అధిగమించి ముందుకువెళ్ళాలని, అందుకు ప్రభుత్వం అన్నివిధాలా సహకరించాలన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే దివ్యాంగులకు ప్రభుత్వం తరుపున రావలసిన ప్రయోజనాలన్నింటినీ అందజేస్తామని హామీనిచ్చారు. గోనుగుంట్ల మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల కోసం ఎన్నో పథకాలు అమలు చేసిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదేనన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల అధ్యక్షుడు పూదోట సునీల్, వెలుగు శివ ప్రసాద్, గొల్లసుల సాయి కుమార్, సోలా బ్రహ్మయ్య, షేక్ నాగూర్ బీ. నంబూరి శ్రీనివాసరావు, జోజి బాబు, వెంకటరావు, ధూళిపాళ్ల కార్తీక్, బాలు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగేతర శక్తిగా విడదల రజిని

● టీడీపీ పశ్చిమ నియోజకవర్గ నేత నిమ్మల శేషయ్య



గుంటూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేగా చిలకలూరిపేట ప్రజలను, మంత్రిగా వైద్య ఆరోగ్య శాఖను వంచించిన విడదల రజిని రాజ్యాంగేతర శక్తిగా మారారని టీడీపీ పశ్చిమ నియోజకవర్గ నేత నిమ్మల శేషయ్య విమర్శించారు. గుజ్జన గుండ్లలోని తన కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో టికెట్ల కోసం కోట్ల రూపాయలు వసూలు చేయడం రజనీ చేసే హేయమైన చర్యల్లో ఒకటి మాత్రమేనని ఆరోపించారు. చిలకలూరిపేట టికెట్ ఇప్పిస్తానంటూ నాటి అనుచరుడు తాజా మాజీ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు చేసిన ఆరోపణలపై చిత్తశుద్ధి ఉంటే విడదల రజని బహిరంగ వివరణ ఇవ్వాలని సవాల్ చేశారు. వైసీపీలోని ఒక సలహాదారుడు అండతో రజని రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరిస్తోందని వైసీపీ శ్రేణులే చేస్తున్న ఆరోపణలకు సమాధానమిచ్చి పశ్చిమ నియోజకవర్గం నుంచి ఎన్నికల్లో నిలవాలని ఆయన డిమాండ్ చేశారు. రాజ్యాంగేతర శక్తులు పశ్చిమ నియోజకవర్గంలో పాగావేస్తే ప్రశాంతంగా ఉండే నియోజకవర్గం అల్లకల్లోలం కావడం తథ్యమని ఆందోళన వ్యక్తంచేశారు. విజ్ఞతకు మారుపేరు, విద్యావంతులైన పశ్చిమ నియోజకవర్గ ఓటర్లు సొంతపార్టీ నేతలే చేస్తున్న ఆరోపణలను పరిగణనలోకి తీసుకోవాలని శేషయ్య కోరారు.

కూటమిదే విజయం : దేగల ప్రభాకర్



కార్యక్రమంలో పాల్గొన్న దేగల ప్రభాకర్

గుంటూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి రాష్ట్ర ప్రజలు స్వాగతిస్తున్నారని, కూటమిదే విజయమని టీడీపీ నగర అధ్యక్షుడు దేగల ప్రభాకర్ అన్నారు. చిలకలూరిపేటసమీపంలోని బొప్పూడిలో జరగనున్న కూటమి సభా వేదికకు బుధవారం యువనేత నిర్వహించిన భూమిపూజ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి సభకోసం దేశమంతా ఎదురు చూస్తోందన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్, దిశా నిర్దేశం చేస్తారన్నారు. దేశంలోనే అతి పెద్దసభగా చిలకలూరిపేట సభ నిలిచిపోతుం దని, సభకు భారీ సంఖ్యలో ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు.



విజ్ఞాన్ వర్సిటీ అధ్యాపకులతో పాట్రిక్ ఫెలాన్

భవిష్యత్తు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌దే ..

● యూఎస్ఏ ప్రొఫెసర్ పాట్రిక్ ఫెలాన్

గుంటూరు(విద్య), మార్చి 13: రానున్న రోజుల్లో ప్రపంచమంతా ఏఐ (ఆర్టిఫిసియల్ ఇంటిలిజెన్స్) మయం కానుందని యూఎస్ఏలోని అరిజోనా స్టేట్ యూనివర్సిటీ మెకానికల్ అండ్ ఏరోస్పేస్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ డీన్ ప్రొఫెసర్ పాట్రిక్ ఫెలాన్ అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ అడ్వాన్స్డ్ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీల సంయుక్త ఆధ్వర్యంలో 'ద ఫ్యూచర్ ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' అంశంపై ప్రత్యేక అతిథి ఉపన్యాస కార్యక్రమాన్ని బుధ వారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాట్రిక్ ఫెలాన్ మాట్లాడుతూ ప్రస్తుతం ఏఐ, మెషిన్ లెర్నింగ్‌స్కిల్స్ ఉంటేనే సంస్థలు అభ్యర్థుల వైపు చూసే పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో యూఎస్ఏలోని అరిజోనా స్టేట్ యూనివర్సిటీ గ్రాడ్యుయేట్ అండ్ ఇంటర్నేషనల్ ట్రాన్స్‌ఫర్ రిక్రూట్‌మెంట్ అసోసియేట్ డైరక్టర్ చెస్టెర్ హెండర్సన్, యూఎస్ఏలోని అరిజోనా స్టేట్ యూనివర్సిటీ రెప్రెజెంట్ రోషన్ లాలన్, వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉమ్మడి కాపు సంఘాల సమావేశంలో పాల్గొన్న నేతలు

కూటమికే.. కాపు సంఘాల మద్దతు

● ఒక సీటు కాపులకు ఇవ్వాలి ● ఉమ్మడి సమావేశంలో కాపు నేతలు

గుంటూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికే కాపుసంఘాల మద్దతు ఉంటుందని అయితే, గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గంలో తూర్పు/పశ్చిమలో ఏదో ఒకటి కాపు అభ్యర్థికి కేటాయించాలని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక అరండల్‌పేట 2వ లైనులో యర్రగోపు నాగేశ్వరరావు అధ్యక్షతన కాపు సంఘ నేతల ఉమ్మడి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాపు జేఏసీ రాష్ట్ర చైర్మన్ అమ్మ శ్రీనివాసనాయుడు మాట్లాడుతూ.. కాపులను ఓటు బ్యాంకుగా చూడొద్దన్నారు. జనాభా దామాషా ప్రకారం తమకు రావాల్సిన సీట్లను కేటాయించాలన్నారు. కాపు నాడు రాష్ట్ర అధ్యక్షుడు సంకటి లక్ష్మణరావు మాట్లాడుతూ గుంటూరుపార్లమెంట్ పరిధిలో 2.70 లక్షల పైచిలుకు ఓటుబ్యాంకు కలిగివున్న కాపులకు సీటు ప్రకటించకపోవడం తమను ఆవేదనకు గురి చేస్తున్నదన్నారు. కాపునాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు యర్రగోపు నాగేశ్వరరావు మాట్లాడుతూ కూటమి పార్టీల్లో ఎవరికి సీటు కేటాయించినా అభ్యర్థిని తాము గెలిపించుకుంటామని స్పష్టంచేశారు. సమావేశంలో కాపు రాజకీయ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బొక్కిసం శివరామ్, కాపు సంఘాల నాయకులు వెలిగంటి కోటేశ్వరావు , దళవాయి సుబ్రహ్మణ్యం, మిరియాల వెంకట్రావు, పగడాల సీతారామయ్య, రాగం సదాశివరావు, ఏనుగుల రమణ, ఎస్ శ్రీనివాసరావు, అడపా ప్రసాద్ బాబు, కొప్పరాజు మారుతి కిషోర్, నిశంకరరావు అమర్నాథ్, లక్ష్మిశెట్టి నాని, మేకల బాబు రావు, ఎద్దల రమేష్, పరకండ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సర్వం సన్నద్ధం

● కలెక్టర్ ఎం. వేణుగోపాల్‌రెడ్డి

● రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



డమ్మీ ఓటింగ్ యంత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్, పార్టీల ప్రతినిధులు

గుంటూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో కలెక్టర్, జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, డీఆర్వో పెద్ది రోజాతో కలసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ ప్రకటన అనంతరం ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలుచేయటానికి అవసరమైన ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ, సెక్టార్ అధికారులను నియమించి శిక్షణను ఇచ్చామన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజన్సీలైన ఆదాయపన్ను శాఖ, రాష్ట్ర పన్నుల శాఖ, సెబ్, పోలీస్, ఎక్సైజ్, ఫారెస్ట్, ఆడిట్ శాఖల నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించి నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించామన్నారు. పోలింగ్ పర్సన్‌కు సంబంధించి అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగుల వివరాలను ఎన్నికల సంఘం పోర్టల్‌లో అప్లోడ్ చేయటం జరిగిందని, ఈసీ అదేశాల మేరకు గ్రామ, వార్డు సచివాలయం ఉద్యోగులను ప్రతి పోలింగ్‌బూత్‌లో ఒకరిని వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సెక్టార్ అధికారులు, పోలింగ్ పర్సన్‌కు ఈవీఎంల కమిషనింగ్, వినియోగంపై శిక్షణ ఇచ్చేందుకు ఈవీఎం గౌడన్ల నుంచి ఈవీఎంలను పూర్తి భద్రత మధ్య తెనాలి సబ్ కలెక్టర్‌కు, గుంటూరు రెవెన్యూ డివిజన్ అధికారికి అప్పగించామని తెలిపారు. శిక్షణ సమయంలో వాటిని వినియోగించుకొని ప్రతిరోజు వాటిని ఆర్డీవో, సబ్ కలెక్టర్ కార్యాలయంలోని ప్రత్యేక స్ట్రాంగ్ రూంలో భద్రపరచటం జరుగుతుందన్నారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి వివిధ ప్రక్రియలను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా కలెక్టరేట్ లో కంట్రోల్ రూంను ఏర్పాటుచేస్తున్నామన్నారు. నామినేషన్ల చివరి రోజు వరకు నూతన ఓటుకు దరఖాస్తులు తీసుకోవటం జరుగుతుందని, వీటిని నిర్దేశిత సమయంలో పరిష్కరించి ఓటర్ల జాబితాలో అప్డేట్ చేస్తున్నట్లు తెలిపారు. జరుగుతుందన్నారు. స్వేచ్ఛయుత వాతవారణంలో సజావుగా కొనసాగేలా జిల్లా యంత్రాంగానికి రాజకీయపార్టీలు పూర్తి సహకారం అందించాలన్నారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు డాక్టర్ తాతా సేవాకుమార్(ఆమ్‌ఆద్మీ పార్టీ), చిరతన గండ్ల వాసు(బీఎస్పీ), రాచమల్లు భాస్కరరావు (బీజేపీ), కృష్ణకాంత్ (సీపీఎం), బిళ్ళా సునీల్ (కాంగ్రెస్), కంచర్ల శివరామయ్య(టీడీపీ), అత్తోట జోసఫ్ కుమార్(వైసీపీ), స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీకుమారి, జీఎంసీ ఏసీ రాజ్యలక్ష్మీ, ఆర్డీవో పీ. శ్రీకర్ పాల్గొన్నారు.

నియోజకవర్గాలకు డమ్మీ ఓటింగ్ యంత్రాలు

రానున్న సాధారణ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లను దృష్టిలో పెట్టుకొని జిల్లాలోని ఓటింగ్ విధానంపై అవగాహన కల్పించఏందుకు డమ్మీ ఓటింగ్ యంత్రాలను ఎన్నికల సంఘం జిల్లాకు పంపించింది. వాటిని జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు బుధవారం గుంటూరు ఆర్‌డీవో కార్యాలయం నుంచి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏడు శాసన సభ, ఒక పార్లమెంట్ నియోజకవర్గానికి చెందిన ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, సెక్టోరల్ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన కల్పించే నిమిత్తం ఒక్కో యోజకవర్గానికి 18 కంట్రోల్ యూనిట్లు, ఈవియంలు, వీవీప్యాట్లు చొప్పున రిటర్నింగ్ అధికారులకు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పంపిణీచేశారు. అవగాహన కార్యక్రమాలు పర్తయిన తర్వాత ఈ ఓటింగ్ యంత్రాలను భద్రపరుస్తామని, ఎన్నికల్లో వీటిని వినియోగించడం ఉండదని తెలిపారు.

ఎపిక్‌లు ఎప్పటికప్పుడు పంపిణీ

● ఓటరు జాబీతాలలో ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు చర్యలు

● రాజకీయ పార్టీల నేతలకు వివరాలు అందజేస్తున్నాం

● సీఈవోకు నివేదించిన జేసీ రాజకుమారి

గుంటూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం జారీ చేస్తున్న ఎలక్టోరల్ ఫోటో గుర్తింపు కార్డు(ఎపిక్)లను ఎప్పటికప్పుడు ఓటర్లకు స్పీడు పోస్టు ద్వారా పంపిణీ చేస్తున్నామని జాయింట్ కలెక్టర్ రాజకుమారి గణియా ఎన్నికలసంఘం రాష్ట్ర ఉన్నతాధికారి ముకేష్ కుమార్ మీనాకు నివేదించారు. బుధవారం రాష్ట్ర సచివాల యం నుంచి సీఈవో మీనా సార్వత్రిక ఎన్నికల సన్నద్ధత ఏర్పాట్లు, ఓటరు దరఖాస్తుల పరిష్కారం, గుర్తింపు కార్డుల పంపిణీ తదితర అంశాలపై కలెక్టర్లు, ఎస్పీలతో వీడియోకాన్ఫరెన్స్‌ద్వారా సమీక్ష నిర్వహిం చారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ వీసీ సమావేశ మందిరం నుంచి కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, ఎస్పీ తుషార్ డూడీ, జేసీ జి.రాజకుమారి, జీఎంసీ కమిషనర్ కీర్తీ చేకూరి, డీఆర్వో పెద్ది రోజాతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ రాజకుమారి మాట్లాడుతూ జిల్లాకు ప్రింటింగ్ అయివచ్చిన ఎపిక్‌కార్డులను పోస్టల్ డిపార్టుమెంట్ ద్వారా ఎప్పటికప్పుడు పంపిణీ చేస్తున్నామ న్నారు. జిల్లా కంట్రోల్ రూం, కంప్లయింట్ మేనేజ్‌మెంట్, రిపోర్టింగ్ మేనేజ్మెంట్ సిస్టమ్, సోషల్ మీడియా సెల్‌ఏర్పాటు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలకు నోడల్ అధికారుల నియమించటం జరిగిందన్నారు. ఓటరు జాబితాపై మీడియాలో వచ్చిన కథనాలు, ఫిర్యాదులను ఎప్పటికప్పుడు విచారించి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, వివరాలను ఈసీకి, రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందిస్తున్నామన్నారు. ఎస్ఎస్ఆర్- 2024 తుది ప్రచురణ అనంతరం ఫారం-6, 7, 8 లకు సంబంధించి నేటి వరకు అందిన 81,505 దరఖాస్తులలో 74,385 పరిష్కరించడం జరిగిందని, మిగిలిన 7,120 దరఖాస్తులను విచారించి ఈఆర్‌వోలు పరిష్కరించేలా నిరం తరం పర్యవేక్షిస్తున్నా మన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సౌకర్యాల పనులు పూర్తి చేయటం జరిగిందని సీఈవో ముఖేష్ కుమార్‌మీనాకు సంయుక్త కలెక్టర్ వివరించారు. సమావేశంలో ఆర్డీఓ శ్రీఖర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లక్ష్మీకుమారి, స్వాతి, గంగరాజు, జిల్లా ఉపాధి అధికారి రఘు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



కిరణ్‌కుమార్, శ్రీకాంత్‌కు చెక్కును అందజేస్తున్న సయ్యద్ రసూల్

జీజీహెచ్ కార్డియాలజీ విభాగానికి

రూ.2.50 లక్షల విరాళం

గుంటూరు (మెడికల్) మార్చి 13: గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలోని కార్డియాలజీ విభాగానికి ట్రెడ్‌మిల్ కొనుగోలు నిమిత్తం రూ.2.50 లక్షలను కేర్ డెంటల్ కాలేజీ చైర్మన్ డాక్టర్ సయ్యద్ రసూల్ విరాళంగా ప్రకటించారు. ఈమేరకు బుధవారం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వై కిరణ్‌కుమార్, కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎన్ శ్రీకాంత్‌కు నగదు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ట్రెడ్‌మిల్ మిషన్ ఖరీదు రూ.3.50 లక్షలని, డాక్టర్ రసూల్ రూ.2.50 లక్షలు విరాళంగా ఇవ్వగా, మిగిలిన రూ. లక్షను కార్డియాలజీ హెచ్‌వోడీ డాక్టర్ శ్రీకాంత్ అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం వారంలో మూడు రోజులు పనిచేస్తున్న గుండె జబ్బుల ఓపీ విభాగం ఇకపై వారంలో అన్ని రోజులు పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

అబ్బుడా అధ్యక్షుడుగా డాక్టర్ దీక్షిత్...

ఆంధ్రప్రదేశ్ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (అబ్బుడా) జీజీహెచ్/జీఎంసీ శాఖ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా డాక్టర్ దీక్షిత్, డాక్టర్ సుస్మిత ఎన్నికయ్యారు. బుధవారం వారు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జూనియర్ డాక్టర్ల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అబ్బుడా మాజీ అధ్యక్షుడు డాక్టర్ అఖిల్, నూతన కార్యవర్గ సభ్యులు రవి, వెంకటేష్, పవన్, రామచంద్ర, బాలు నాయక్, ప్రవళి, సాయిశ్రీనివాస్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని ఓడించడమే ప్రధాన లక్ష్యం

● రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి లక్ష్మయ్య

గుంటూరు(తూర్పు), మార్చి13: రవాణా రంగ కార్మికులపై భారాలు మోపుతున్న బీజేపీని ఎన్నికల్లో ఓడించాలని ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టువర్కర్స్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య పిలుపునిచ్చారు. బుధవారం పాత గుంటూరు, సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆ సంఘ నేత ఎస్ శివాజీ అధ్యక్షతన రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2019 మోటారు వాహన చట్టాన్ని తీసుకొచ్చి ఆ రంగాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. న్యాయసంహిత చట్టాలు పేరుతో వస్తున్న నూతన విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్, జీ. శ్రీనివాసులు, పోలి నాయుడు, ప్రభాకర్, బీ. లక్ష్మణరావు, రఫీ, రాజా, హరి పోతురాజు, గోపి, కొండలు తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలానికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

గుంటూరు, మార్చి 13: ఈనెల 25న పౌర్ణమికి అరుణాచలంలో గిరి ప్రదక్షణకు భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించినట్లు గుంటూరు-2 డిపో మేనేజర్ అబ్దుల్ సలాం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌టీ ఆర్ బస్టాండ్ నుంచి 23న రాత్రి 9.15 గంటలకు బయల్దేరి 24వ తేదీన శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్ టెంపుల్ దర్శించుకొని అదేరోజు రాత్రి అక్కడే బసచేసి 25న పౌర్ణమి రోజున అరుణాచలం నకు చేరుకుంటుందన్నారు. అదే రోజు సాయంత్రం బయల్దేరి 26న ఉదయం 6.30గంటలకు గుంటూరు బస్టాండ్‌కు చేరుకుంటుందన్నారు. 96164 బస్సుసర్వీస్ నెంబర్‌కు ఆన్‌లైన్ రిజర్వేషన్ అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఒక్కోఛార్జీ రూ. 2420 అని అన్నారు. అదనపు సమాచారం కోసం 7382897459 సంప్రదించాలని కోరారు.

ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర వెలకట్టలేనిది

గుంటూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వైద్యరంగంలో ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర ఎంతో ముఖ్యమైందని గుంటూరుజిల్లా ల్యాబ్ అండ్ ఎక్స్‌రే ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనం సంజీవరెడ్డి అన్నారు. బుధవారం 'ప్రపంచ ల్యాబ్ టెక్నీషియన్ డే'ను పురస్కరించుకొని లక్ష్మీపురంలోని అసోసియేషన్ జిల్లా కార్యాలయంలో ఆదర్శ ల్యాబ్ టెక్నీషియన్లకు సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు అధ్యక్షత వహించిన ఆనం సంజీవరెడ్డి మాట్లాడుతూ గడిచిన 50 ఏళ్లలో ఎంతో మందిని ల్యాబ్‌టెక్నీషియన్లుగా తర్ఫీదు చేసిన మహోన్నత వ్యక్తులలో ప్రముఖులైన కే.బాలకృష్ణ, ఆనం బాలవాణిలను అసోసియేషన్ ఆధ్వర్యంలో సభ్యులు ఘనంగా సత్కరించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో తాడేకోరు శ్రీహరిబాబు, సిటీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.వెంకటలక్ష్మణ్, కార్యదర్శి శ్రీనివాసరావు, కోశాధికారి ఎస్.వెంకట రమణారావు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

వర్గీకరణకు మద్దతు తెలిపితే సహించం


● మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ళ అరుణ్‌కుమార్

గుంటూరు, మార్చి 13: ఎస్సీ వర్గీరణకు మద్దతు తెలిపితే సహించేది లేదని, ఆయా పార్టీల నేతలను గ్రామాల్లో తిరగనివ్వమని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ళ అరుణ్‌కుమార్ హెచ్చరించారు. ఏసీ కళాశాల రోడ్డులోనున్న అంబేద్కర్ సభలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సదర్భంగా మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడిగా గోదా జాన్‌పాల్‌ను నియమిస్తూ ఆయన నియామకపు ఉత్తర్వులు అందజేశారు. అలాగే రాష్ట్ర కార్యదర్శిగా రాయలసీమకు చెందిన సాత్రి లక్ష్మయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం అరుణ్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో మెజారిటీ ఉన్న మాలలను అన్ని రాజకీయపార్టీలు ఓటుబ్యాంకుగా వాడుకుంటున్నాయని ఆగ్రహంవ్యక్తం చేశారు. ప్రాధాన్యం కల్పించకపోగా డబ్బు సంచులు చూయించిన వారికే ప్రాధాన్యత ఇస్తున్నారని, అటువంటి పార్టీలకు తగిన గుణపాఠం చెబుతామన్నారు. ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలిపే ఆయా నియోజక వర్గ అభ్యర్థులకు వ్యతిరేకంగా మాల మహానాడు తరపున అభ్యర్థులను నిలబెడతామన్నారు. సమావేశంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పిల్లి మేరి, అధికార ప్రతినిధి శీలం రోజన్ బాబు, రాష్ట్ర కార్యదర్శి సొంగా వెంకటరమణ, విజయ్, ఏచూరి, వేణు, శాంతరాజు, ఏకుల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

లెజండరీ లీడర్ రోశయ్య

● రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని

● హిందూ కాలేజీ వద్ద మాజీ సీఎం రోశయ్య విగ్రహావిష్కరణ



రోశయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి రజిని, ఎమ్మెల్యేలు గిరిధర్, ముస్తఫా

గుంటూరు, మార్చి 13: రాజకీయాల్లో లెజండరీ లీడర్ డాక్టర్ కొణిజేటి రోశయ్య అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజినీ అన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ ఆధ్వర్యంలో పలువురు ఆర్యవైశ్యుల సహకారంతో హిందూ కళాశాల సెంటర్‌లో ఏర్పాటు చేసిన మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య కాంస్య విగ్రహాన్ని బుధవారం ప్రభుత్వ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, ఎమ్మెల్యేలు ఎండీ ముస్తఫా, కిలారి రోశయ్య, క్రేన్‌గ్రూపు సంస్థల చైర్మన్ గ్రంధి కాంతారావు, వ్యాపారవేత్త బొమ్మిడాల కృష్ణమూర్తిలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి రజినీ మాట్లాడుతూ రాష్ట్రంలోనే కాక దేశంలోనే గుంటూరుకు రోశయ్య కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చారన్నారు. ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిన నేత రోశయ్య అన్నారు. రాష్ట్రంలో 16 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టి రికార్డు సృష్టించిన భీష్మాచార్యులన్నారు. ఎమ్మెల్యే గిరిధర్ మాట్లాడుతూ రోశయ్య ఆర్యవైశ్యులు కావటం గర్వకారణమన్నారు. ఆయన పట్టుదల, కార్యదక్షత, క్రమశిక్షణ ఆదర్శమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు, డీసీసీబీ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు, వైసీపీ తూర్పుసమన్వయకర్త షేక్ నూరిఫాతిమా, చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు, ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి సాధు ప్రతాప్, పల్నాడు డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, బిజినేపల్లి రాధ, నూకల వేణు, గుడిపాటి భాస్కర్, రత్నప్రసాద్, టీఎల్‌వీ వీరాంజనేయులు, శరత్ తదితరులు పాల్గొన్నారు.

కవయిత్రి మొల్ల రచనలు చారిత్రాత్మకం

● ఎస్పీ తుషార్ డూడీ.. మొల్ల చిత్రపటానికి ఘన నివాళి




కవయిత్రి మొల్ల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ తుషార్‌డూడీ

గుంటూరు, మార్చి 13: కవయిత్రి మొల్ల రచనలు చరిత్రలో నిలిచి ఉంటాయని ఎస్పీ తుషార్ డూడీ అన్నారు. బుధవారం 16వ శతాబ్దపు తెలుగు కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ (మొల్ల) జయంతి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఆమె చిత్రపటానికి ఎస్పీ తుషార్‌డూడి పూల మాలలు వేసి ఘనంగాని వాళులర్పించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విలువలతో కూడిన కవిత్వం ప్రజల మనస్సుల్లో సుస్థిరమై, చరిత్రలో నిలిచిపోయే రీతిలో ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అడ్మిన్ అడిషనల్ ఎస్పీ జీవీ.రమణమూర్తి, క్రైం అదనపు ఎస్పీ శ్రీనివాస రావు, ఎఆర్ డీఎస్పీ శాంత కుమార్, స్పెషల్ బ్రాంచ్ సీఐ వెంకటరావు, వెల్ఫేర్‌ఆర్ఐ హరిరెడ్డి, పోలీసుకార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి.. ఈ నెల 16న జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ తుషార్‌డూడీ కోరారు. మెగా లోక్ అదాలత్ కార్యక్రమం గురించి కక్షిదారులకు అవగాహన కల్పిస్తూ ఇరు పక్షాల వారికి కౌన్సిలింగ్ నిర్వహించి వీలైనంత వరకు ఎక్కువగా కేసులను వీగిపోయేలా చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రాజీ చేయదగిన క్రిమినల్, సివిల్, రోడ్డు ప్రమాదాలు, కుటుంబ తగాదాలకు సంబంధించిన కేసులలో ఇరుపక్షాల సమ్మతితో పరిష్కరించాలని సూచించారు. అదేవిధంగా ఎక్సైజ్, ఇతర కేసులు వీలైనంతవరకు ఎక్కువగా రాజీ పడేలా చేయాలన్నారు. కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకొని కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

గుంటూరు, మార్చి 13: రౌడీషీటర్‌లు చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఈస్ట్ సబ్‌డివిజన్ పరిధిలోని సీఐలు హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం లాలాపేట స్టేషన్‌లో ఆయా రౌడీషీటర్‌లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈసందర్భంగా సీఐలు దేవప్రభాకర్, అన్వర్‌బాషా, పాతగుంటూరు ఎస్ఐ నాగరాజకుమారి తదితరులు ఆయా రౌడీషీటర్‌లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని రౌడీషీటర్‌లు పెచ్చుమీరితే వారిపై చర్యలు తప్పవన్నారు. రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొంటే చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల గొడవలు, పంచాయతీలు, సివిల్ వివాదాల్లో తలదూర్చితే సహించేదిలేదన్నారు. ప్రతివారం స్టేషన్‌కు హాజరై సంతకాలు చేయాలన్నారు. రౌడీషీటర్‌ల కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంటుందని జాగ్రత్తగా నడుచుకోవాలని హెచ్చరించారు.



బీసీ నేత ఉగ్గం సాంబశివరావును సన్మానిస్తున్న కుల, వివిధ సంఘాల నేతలు

జనాభా దామాషా ప్రకారం

చట్ట సభల్లో రిజర్వేషన్ కల్పించాలి

గుంటూరు, మార్చి 13 : రానున్న ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం చట్టసభల్లో రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని వివిధ బీసీ సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు బుధవారం అరండల్‌పేటలోని అంబేద్కర్ మినీహాల్లో బీసీ మహాజన సమితి అధ్యక్షుడు ఉగ్గం సాంబశివరావు అధ్యక్షతన బీసీ సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో ఆయా సంఘాల నేతలు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్రంగా కుల, జనగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో ఆయా సంఘాల నేతలు కొరివి వినయ్‌కుమార్, సీనియర్ న్యాయవాది వైకే, గుంటుపల్లి పూర్ణయ్య, మేకల సుబ్బారావు, ఆకురాతి మురళీకృష్ణ, డాక్టర్ ఆలా వెంకటేశ్వరు, తాళ్ళ వెంకటేష్ యాదవ్, కె జయసుధ, జూపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అమరావతి రోడ్డులో చైన్ స్నాచింగ్

గుంటూరు, మార్చి 13: స్థానిక అరండల్ పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని అమరావతి రోడ్డులోని ప్రియా గార్డెన్స్ వద్ద బుధవారం చైన్ స్నాచింగ్ జరిగింది. వీరేళ్ల పద్మావతి అనే మహిళ బుధవారం సాయంత్రం ప్రియా గార్డెన్స్ వద్ద ఆటో దిగి నడుచుకుంటూ వెళుతుండగా శాకంబరీ అపార్ట్‌మెంట్ వద్దకు వచ్చేసరికి ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు పద్మావతి మెడలోని గొలుసును తెంచుకు పారిపోయారు. గొలుసు 5 సవర్లు ఉంటుందని బాధితురాలు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పెన్షన్ ప్రతిపాదనలు పంపటంలో నిర్లక్ష్యం తగదు

● ఉద్యోగ విరమణ రోజే పెన్షన్ ప్రయోజనాలను అందించాలి

గుంటూరు, మార్చి13: ఉద్యోగ విరమణచేసే వారి పెన్షన్ ప్రతిపాదనలను ఆ శాఖకు పంపటంలో అధికారులు నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తున్నారని రాష్ట్ర పెన్షన్‌దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య బుధవారం ఒక ప్రకటనల పేర్కొన్నారు. ఎకౌంటెంట్ జనరల్ ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షన్ విడుదల ఆర్డర్స్ ఇచ్చే అధికారి, నాల్గో తరగతి ఉద్యోగులకు జిల్లాలలో జిల్లా ఆడిట్ ఆఫీసర్‌పెన్షన్ విడుదల ఉత్తర్వులు జారీ చేసే అధికారులన్నారు. న్యూఢిల్లీలోని ఏపీ గెస్ట్‌హౌస్‌లో పనిచేసే క్లాస్-4 ఉద్యోగుల పెన్షన్ విడుదల ఏపీ భవన్, న్యూ ఢిల్లీ పే అండ్ అకౌంట్స్ అధికారికి ఇస్తారన్నారు. 6 మాసాలలో ఉద్యోగి రిటైర్డ్ అవుతాడనగా ఉద్యోగి సర్వీసు పుస్తకం, ఉద్యోగి ఇచ్చిన పార్ట్-1 ఫారం, నామినేషన్ ఫారం, కుటుంబ సభ్యుల ఫారం మొదలైనవి పంపాలని తెలిపారు. ఉద్యోగి రిటైర్‌మెంట్ అయిన వెంటనే ఆయనకు ఆఖరి సారి ఇచ్చిన జీతభత్యాల వివరాలను ఎకౌంటెంట్ జనరల్‌కు గానీ లేక లోకల్ ఫండ్ అధికారికి గాని పంపాలన్నారు. ఉద్యోగం చేస్తూ మరణించిన సందర్భాల్లో మరణించిన ఉద్యోగి సర్వీసు రిజిష్టరు, గార్డియన్ సర్టిఫికెట్, లాస్ట్ పే సర్టిఫికెట్, మరణ ధ్రువీకరణపత్రం, గ్రాట్యువిటీకి నామినేషన్ పంపాలన్నారు. ఆర్థికశాఖ కార్యదర్శి స్పందించి ఉద్యోగ విరమణచేసే రోజునే పెన్షన్ ప్రయోజనాలన్నీ పొందే విధంగా ఆరు నెలలు ముందుగానే పెన్షన్ ప్రతిపాదనలు పంపే విధంగా చర్యలు తీసుకోవాలని వీరయ్య కోరారు.

దిక్సూచి
DIKSUCHI

ఎన్‌సీ హెచ్‌ఎంసీటీలో ఎమ్మెస్సీ హాస్పిటాలిటీ అడ్మినిస్ట్రేషన్



నోయిడాలోని నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ క్యాటరింగ్ టెక్నాలజీ(ఎన్‌సీహెచ్‌ఎంసీటీ)- ఎమ్మెస్సీ హాస్పిటాలిటీ అడ్మినిస్ట్రేషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు సహా దేశవ్యాప్తంగా 17 ఐహెచ్‌ఎంలు ఉన్నాయి. డైరెక్ట్ అడ్మిషన్స్, ఎమ్మెస్సీ జేఈఈ 2024 కేటగిరీల్లో ప్రవేశాలు కల్పిస్తారు. డైరెక్ట్ అడ్మిషన్స్‌కు అకడమిక్ మెరిట్ ద్వారా ఎమ్మెస్సీ జేఈఈ అభ్యర్థులకు ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా సీట్లు అలాట్ చేస్తారు. ఆసక్తి గల అభ్యర్థులు రెండు కేటగిరీలకు అప్లయ్ చేసుకోవచ్చు. నిబంధనల ప్రకారం ప్రోగ్రామ్ పూర్తిచేసినవారికి 'జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ(జేఎన్‌యూ)' పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిగ్రీని ప్రదానం చేస్తుంది.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి హోటల్ మేనేజ్‌మెంట్‌లో డిగ్రీ లేదా ఎన్‌సీహెచ్‌ఎంసీటీ నుంచి బీఎస్సీ(హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్) ప్రోగ్రామ్‌ను కనీసం 55 శాతం మార్కులతో పూర్తిచేయడానికి తోడు త్రీ స్టార్ హోటళ్లలో రెండేళ్లు పనిచేసిన అనుభవం ఉన్నవారికి డైరెక్ట్ అడ్మిషన్ ఇస్తారు. కేవలం హాస్పిటాలిటీ సహా ఏదేని విభాగంలో డిగ్రీ పూర్తిచేసినవారికి ఎమ్మెస్సీ జేఈఈ 2024 ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రస్తుతం డిగ్రీ చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరు 2024 అక్టోబరు 31 నాటికి మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాలి. వయోపరిమితి నిబంధనలు లేవు.

ఎమ్మెస్సీ జేఈఈ వివరాలు: దీనిని సీబీటీ/ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. ఈ పరీక్షలో 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. జనరల్ నాలెడ్జ్, జనరల్ ఇంగ్లీష్, న్యూమరికల్ ఆప్టిట్యూడ్ అంశాల నుంచి డిగ్రీ స్థాయిలో ప్రశ్నలు అడుగుతారు. అప్లికేషన్ ఆఫ్ కంప్యూటర్స్, హాస్పిటాలిటీ ఆప్టిట్యూడ్ జనరిక్, జనరల్ హోటల్ ఆపరేషన్స్, కరెంట్ అఫైర్స్/జనరల్ నాలెడ్జ్, సస్టయినబుల్ టూరిజం అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అంశాల నుంచి ఒక్కోదానిలో 10 ప్రశ్నలు; హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్, రీసెర్చ్ మెథడాలజీ, అప్రిసియేషన్ ఆఫ్ కల్చరల్ డైవర్సిటీ అంశాల నుంచి ఒక్కోదానిలో 5 ప్రశ్నలు; కమ్యూనికేషన్ స్కిల్స్ ఇన్ ఇంగ్లీష్ అండ్ న్యూమరిక్ ఆప్టిట్యూడ్ నుంచి 20 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే పావు మార్కు కోత విధిస్తారు. మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం రెండు గంటలు.

- **డైరెక్ట్ అడ్మిషన్ అభ్యర్థులకు దరఖాస్తు ఫీజు:** రూ.500
- **ఎమ్మెస్సీ జేఈఈ 2024 అభ్యర్థులకు దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1000; జనరల్ ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.700; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** డైరెక్ట్ అడ్మిషన్స్‌కు ఏప్రిల్ 15; ఎమ్మెస్సీ జేఈఈ అభ్యర్థులకు ఏప్రిల్ 30
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** మే 10 నుంచి
- **పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **ఎమ్మెస్సీ జేఈఈ 2024 తేదీ:** మే 18
- **వెబ్‌సైట్:** www.nchm.gov.in

నేషనల్ లా ఇన్‌స్టిట్యూట్‌లో ఎంసీఎల్ఐఎస్

భోపాల్‌లోని నేషనల్ లా ఇన్‌స్టిట్యూట్ యూనివర్సిటీ(ఎన్ఎల్ఐయూ)- మాస్టర్ ఆఫ్ సైబర్ లా అండ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ(ఎంసీఎల్ఐఎస్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ప్రోగ్రామ్‌ని సంస్థ ఆధ్వర్యంలోని రాజీవ్‌గాంధీ నేషనల్ సైబర్ లా సెంటర్ నిర్వహిస్తోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. గరిష్ఠంగా నాలుగేళ్లలో పూర్తిచేయాల్సి ఉంటుంది. ఏడాదికి రెండు చొప్పున నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. దేశవ్యాప్తంగా నిర్వహించే రిటెన్ ఎంట్రెన్స్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ఉన్నాయి.

ప్రోగ్రామ్ వివరాలు: రీసెర్చ్ మెథడాలజీ, సైబర్ ఎన్విరాన్‌మెంట్, సైబర్ లా, క్రిప్టోగ్రఫీ-నెట్‌వర్క్ సెక్యూరిటీ, ప్రైవసీ అండ్ యాక్సెస్ మేనేజ్‌మెంట్, సైబర్ క్రైమ్స్, ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ ఇన్ సైబర్ స్పేస్, మొబైల్ వైర్‌లెస్-సెక్యూరిటీ, బిజినెస్ ప్లానింగ్-ఆడిట్, సైబర్ ఫోరెన్సిక్స్ అండ్ లా, క్లౌడ్ కంప్యూటింగ్ సెక్యూరిటీ అండ్ లా కోర్సులు ఉంటాయి. చివరి సెమిస్టర్‌లో డిజర్టేషన్, ఇంటర్న్‌షిప్ ఉంటాయి.

సీట్లు: మొత్తం 66 సీట్లు ఉన్నాయి. వీటిలో జనరల్ అభ్యర్థులకు 30, ఎస్టీలకు 12, ఎస్సీలకు 10, ఓబీసీలకు 8, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 6 సీట్లు కేటాయించారు. అన్ని కేటగిరీల్లో 50 శాతం సీట్లను స్థానికులకు(మధ్యప్రదేశ్ వాసులు) ప్రత్యేకించారు. మహిళలకు 18 సీట్లు, దివ్యాంగులకు 3 సీట్లు నిర్దేశించారు. విదేశీ విద్యార్థుల కోసం అదనంగా అయిదు సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.


ఆలిండియా రిటెన్ ఎంట్రెన్స్ టెస్ట్: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 150 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఆప్టిట్యూడ్, జనరల్ అవేర్‌నెస్, ఇంగ్లీష్, కంప్యూటర్ నాలెడ్జ్, సైబర్ సెక్యూరిటీ అంశాల నుంచి ఒక్కోదానిలో 30 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 150. నెగెటివ్ మార్కులు ఉన్నాయి. తప్పుగా గుర్తించిన సమాధానానికి పావు మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు. ఈ పరీక్షలో అర్హత పొందినవారిని మాత్రమే పర్సనల్ ఇంటర్వ్యూకి పిలుస్తారు. ఇంటర్వ్యూకి 50 మార్కులు ఉంటాయి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 15
- **ఆలిండియా రిటెన్ ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** మే 12
- **పర్సనల్ ఇంటర్వ్యూలు:** మే 12, 13, 14
- **వెబ్‌సైట్:** www.nliu.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/5H4Efc8లో
చదవండి.

రైల్వేలో టెక్నీషియన్లు

మొత్తం ఖాళీలు: 9144



దేశ వ్యాప్తంగా వివిధ విభాగాల్లో టెక్నీషియన్ పోస్టుల భర్తీకి రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్ నోటిఫికేషన్ విడుదల చేసింది. రాత, వైద్య పరీక్షల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ఆర్ఆర్‌బీ రీజియన్లు: అహ్మదాబాద్, అజ్మీర్, బెంగళూరు, భోపాల్, భువనేశ్వర్, బిలాస్‌పూర్, చండీగఢ్, చెన్నై, గువాహటి, జమ్మూ అండ్ శ్రీనగర్, కోల్‌కతా, మాల్డా, ముంబయి, ముజఫర్‌పూర్, పట్నా, ప్రయాగ్‌రాజ్, రాంచీ, సికింద్రాబాద్, సిలిగురి, తిరువనంతపురం, గోరఖ్‌పూర్.

1. టెక్నీషియన్ గ్రేడ్-1 సిగ్నల్: **1,092 పోస్టులు**
2. టెక్నీషియన్ గ్రేడ్-3: **8,052 పోస్టులు**

- మొత్తం ఖాళీల్లో ఆర్ఆర్‌బీ సికింద్రాబాద్ పరిధిలో 744 పోస్టులున్నాయి.

అర్హతలు

టెక్నీషియన్ గ్రేడ్-1 సిగ్నల్: బీఎస్సీ, బీఈ/బీటెక్, డిప్లొమా(ఫిజిక్స్/ఎలక్ట్రానిక్స్/కంప్యూటర్ సైన్స్/ఐటీ/ఇన్‌స్ట్రుమెంటేషన్) ఉత్తీర్ణులై ఉండాలి.

టెక్నీషియన్ గ్రేడ్-3: మెట్రిక్యులేషన్/ఎస్ఎస్ఎల్‌సీ, ఐటీఐ(ఎలక్ట్రీషియన్/వైర్‌మ్యాన్/ఎలక్ట్రానిక్స్ మెకానిక్/మెకానిక్ పవర్ ఎలక్ట్రానిక్స్/మెకానిక్/ఫిట్టర్/వెల్డర్/పెయింటర్ జనరల్/మెషినిస్ట్/కార్పెంటర్/ఆపరేటర్ అడ్వాన్స్‌డ్ మెషిన్ టూల్/మెషినిస్ట్/మెకానిక్/మెకానిక్ మెకట్రానిక్స్/మెకానిక్ డీజిల్/మెకానిక్(మోటార్ వెహికిల్)/టర్నర్/ఆపరేటర్ అడ్వాన్స్‌డ్ మెషిన్ టూల్/గ్యాస్ కట్టర్/హీట్ ట్రీటర్/ఫౌండ్రీమన్/ప్యాటర్న్ మేకర్/మౌల్డర్ తదితరాలు). లేదా 10+2(ఫిజిక్స్, మేథ్స్) ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 2024 జూలై 1 నాటికి టెక్నీషియన్ గ్రేడ్-1 సిగ్నల్ పోస్టులకు 18-36 ఏళ్లు; టెక్నీషియన్ గ్రేడ్-3 పోస్టులకు 18-33 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు అయిదేళ్లు; ఓబీసీలకు మూడేళ్లు; దివ్యాంగులకు 10-15 ఏళ్ల సడలింపు ఉంది.

ప్రారంభ వేతనం: నెలకు టెక్నీషియన్ గ్రేడ్-1 సిగ్నల్ పోస్టులకు రూ.29,200. టెక్నీషియన్ గ్రేడ్-3 పోస్టులకు రూ.19,900.

దరఖాస్తు ఫీజు: ఎస్సీ, ఎస్టీ, మాజీ సైనికోద్యోగులు, మహిళలు, ట్రాన్స్‌జెండర్, మైనారిటీ, ఈబీసీ అభ్యర్థులకు రూ.250. ఇతరులకు రూ.500.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష(కంప్యూటర్ బేస్డ్ ఆప్టిట్యూడ్ టెస్ట్), డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 8

వెబ్‌సైట్: https://indianrailways.gov.in/

ఐఐటీ తిరుపతిలో సమ్మర్ ఇంటర్న్‌షిప్

తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)- సమ్మర్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండు నెలలు. ఇది మే 15 నుంచి ప్రారంభమౌతుంది. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత వసతి సౌకర్యం కల్పిస్తారు.

విభాగాలు: కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, మేథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, ఫిజిక్స్

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి బీఈ/బీటెక్/బీఎస్సీ/ఎమ్మెస్సీ/బీఏ/ఎంఏ ప్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

స్టయిపెండ్: ప్రతి విభాగంలో మొదటి అయిదు స్థానాల్లో ఉన్న వారికి ఒక్కొక్కరికి నెలకు రూ.5,000ల స్టయిపెండ్ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 31
- **సమ్మర్ ఇంటర్న్‌షిప్ 2024:** మే 15 నుంచి జూలై 14 వరకు
- **ఈ-మెయిల్:** research@iittp.ac.in
- **వెబ్‌సైట్:** www.iittp.ac.in

సినిమా చూస్తూ నవ్వుతూనే ఉన్నా

రాజమౌళి



'సాధారణంగా నాకు రోమ్‌కామ్ సినిమాలు నచ్చవు. యాక్షన్, మాస్ చిత్రాలు కావాలి నాకు. కానీ 'ప్రేమలు' సినిమాను థియేటర్‌లో చూస్తున్నప్పుడు నవ్వుతూనే ఉన్నా. ఇది తప్పకుండా థియేటర్‌లోనే చూడాల్సిన చిత్రం' అన్నారు దర్శకుడు రాజమౌళి. కామెడీ, లవ్ అంశాలతో మలయాళంలో రూపొందిన చిత్రాన్ని ఆయన తనయుడు కార్తికేయ తెలుగు ప్రేక్షకులకు అందించారు. ఇటీవల విడుదలైన ఈ చిత్రానికి మంచి స్పందన వస్తోంది. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో రాజమౌళి మాట్లాడారు. డిస్ట్రిబ్యూటర్‌గా మారిన కార్తికేయను ఆయన అభినందించారు. 'మలయాళంలో కంటే తెలుగులో డైలాగులు బాగున్నాయి. పరీక్షలు ఉన్నాయని ఈ సినిమా చూడడం మానకండి. చిత్రం చూస్తే ఇంకా రిలాక్స్ అయి బాగా చదువుతారు' అన్నారు దర్శకుడు అనిల్ రావిపూడి. కార్తికేయ మాట్లాడుతూ 'చాలా తక్కువ టైమ్‌లో ఈ సినిమాను తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చాం. రచయిత ఆదిత్య , పాటల రచయిత కిట్టు .. ఇలా మేమందరం కలసి వారం రోజుల్లోనే పూర్తి చేశాం' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో మమిత, నస్లీన్, దర్శకుడు గిరీశ్, సంగీత దర్శకుడు కీరవాణి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకాక్‌లో యాక్షన్ స్టార్ట్



ధనుష్, నాగార్జున కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న 'కుబేర' చిత్రం షెడ్యూల్ బ్యాంకాక్‌లో మొదలైంది. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్‌మోహన్‌రావు నిర్మిస్తున్నారు, ఇటీవల విడుదల చేసిన ఫస్ట్ లుక్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. ప్రస్తుతం బ్యాంకాక్‌లో నాగార్జున, ఇతర నటీనటులపై కొన్ని కీలక సన్నివేశాలు, యాక్షన్ పార్ట్ చిత్రీకరిస్తున్నారు. భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమా షూటింగ్ ఇంతవరకూ ఎవరూ చూడని అద్భుత లొకేషన్స్‌లో జరుగుతుందని నిర్మాతలు చెప్పారు. రష్మిక కథానాయికగా నటిస్తున్నారు. సోనాలి నారంగ్ ఈ చిత్రానికి సమర్పకురాలు.



హను-మాన్ టీమ్‌కు ప్రశంసలు

భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయాలను, వాటి నుంచి ఉద్భవించిన సూపర్ హీరోలను అద్భుతంగా చూపించి విజయం సాధించిన 'హను-మాన్' చిత్రం టీమ్‌ను కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రశంసించారు. పార్టీ సమావేశంలో పాల్గొనడం కోసం హైదరాబాద్ వచ్చిన అమిత్ షాను 'హను-మాన్' చిత్ర దర్శకుడు ప్రశాంత్ వర్మ, హీరో తేజ, నిర్మాత నిరంజన్ రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు హనుమంతుడి విగ్రహాన్ని బహూకరించారు. ఈ సినిమాకు సీక్వెల్‌గా వస్తున్న 'జై హనుమాన్' కూడా విజయం సాధించాలని అమిత్ షా ఆకాంక్షించారు.

ఫికర్ మత్ కరో అనిపించాలి

ఆర్. నారాయణమూర్తి



సాయిరామ్ శంకర్, యషా శివకుమార్, హెబ్బా పటేల్ హీరోహీరోయిన్లుగా నటించిన 'వెయ్ దరువెయ్' చిత్రం ఈ నెల 15న విడుదల కానుంది. నవీన్ రెడ్డి దర్శకత్వంలో దేవరాజ్ పోతూరు నిర్మించిన ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఫంక్షన్ మంగళవారం రాత్రి జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న పీపుల్స్‌స్టార్ ఆర్.నారాయణమూర్తి, దర్శకుడు త్రినాథరావు నక్కిన బిగ్ టికెట్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా నారాయణమూర్తి మాట్లాడుతూ 'ఈ సినిమాలో సాయిరామ్ శంకర్ 'ఫికర్ మత్ కరో' అనే డైలాగ్ చెబుతుంటారు. ఆయన అందరి నోట 'ఫికర్ మత్ కరో' అనిపించాలి' అని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆకాశ్ పూరి మాట్లాడుతూ 'మా బాబాయ్‌లోని ఎనర్జీ ఎక్కడా లేదు. 'బంపర్ ఆఫర్'లో ఆ ఎనర్జీని చక్కగా చూపించారు. దానికి మించి ఈ సినిమాలో చూస్తారు' అన్నారు. 'దర్శకుడు నవీన్ కథ చెప్పగానే నచ్చింది. నా బాడీ లాంగ్వేజ్‌కు సూట్ అవుతూనే మంచి పాయింట్‌తో కథ రాసుకున్నారని అనిపించింది. నాకు కమ్ బ్యాక్ మూవీ అవుతుంది' అని చెప్పారు సాయిరామ్ శంకర్. దర్శకుడు నవీన్‌రెడ్డి మాట్లాడుతూ 'మా నిర్మాత సపోర్ట్‌తో 34 రోజుల్లోనే సినిమా పూర్తి చేశామని నిర్మాత దేవరాజ్ కోరారు.

హై యాక్షన్ ప్యాక్డ్ మూవీ



శివకార్తికేయన్ హీరోగా ఏ.ఆర్. మురుగదాస్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం షూటింగ్ రెండో షెడ్యూల్ మొదలైంది. చిత్రంలోని ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. శివకార్తికేయన్ కెరీర్‌లో ఇది బిగ్గెస్ట్ బడ్జెట్ చిత్రమనీ, ఇంతకు ముందు నటించిన చిత్రాలకు భిన్నంగా ఈ సినిమాలో ఆయన కనిపిస్తారనీ నిర్మాతలు చెప్పారు. కన్నడ నటి రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో హై యాక్షన్ ప్యాక్డ్‌గా తయారవుతున్న ఈ చిత్రానికి అనిరుధ్ సంగీత దర్శకుడు. సుదీప్ ఎలామన్ సినిమాటోగ్రాఫర్.



రాజావారు రాణిగారి పెళ్లిసందడి

రాజావారు రాణిగారు చిత్రంతో హీరో హీరోయిన్లుగా తెలుగు తెరకు పరిచయమైన కిరణ్ అబ్బవరం, రహస్య గోరక్ జంట నిజజీవితంలోనూ ఒక్కటవబోతోంది. ఆ సినిమా సమయంలోనే ప్రేమలో పడిన ఈ జంట త్వరలోనే పెళ్లిపీటలెక్కబోతోంది. హైదరాబాద్‌లోని ఓ రిసార్ట్‌లో బుధవారం వీరిద్దరి నిశ్చితార్థ కార్యక్రమం ఘనంగా జరిగింది. కొద్దిమంది కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో ఉంగరాలు మార్చుకున్నారు. వీరి నిశ్చితార్థం వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

స్వచ్ఛమైన ప్రేమకథ లంబసింగి

నవీన్ గాంధీ



భరత్‌రాజ్ హీరోగా, దివి హీరోయిన్‌గా నటించిన 'లంబసింగి' చిత్రం ఈ నెల 15న విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు నవీన్ గాంధీ మీడియాతో మాట్లాడుతూ 'ఒక స్వచ్ఛమైన ప్రేమకథను సహజంగా చూపించాలని 'లంబసింగి' చిత్రం తీశాను. కొత్తవారయితేనే బాగుంటుందని నూతన నటీనటులతో రూపొందించాం. సినిమాలో ప్రతి పాత్ర రియలిస్టిక్‌గా ఉంటుంది. లంబసింగి అనే ఏజెన్సీ ప్రాంతంలో 50 రోజుల పాటు సింగిల్ షెడ్యూల్‌లో షూటింగ్ చేశాం. ఇలాంటి ప్రేమకథలకు సంగీతం ప్రధానం. అందుకే పాటలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సంగీత దర్శకుడు ఆర్.ఆర్. ధ్రువన్‌తో చేయించాం. అన్ని పాటలు మంచి ఆదరణ పొందాయి' అని చెప్పారు. దర్శకుడు కల్యాణ్‌కృష్ణ సొంతంగా బేనర్ స్టార్ట్ చేసి కథలు వింటున్నారని తెలిసి ఆయన్ని కలిశాననీ, తను చెప్పిన కథ ఆయనకు నచ్చిందనీ నవీన్ గాంధీ తెలిపారు. అయితే కరోనా కారణంగా షూటింగ్ ఆలస్యంగా మొదలైందని చెప్పారు.

పతంగ్ పాట



పతంగుల పోటీ నేపథ్యంలో తెలుగులో తెరకెక్కిన తొలి క్రీడా నేపథ్య చిత్రం 'పతంగ్'. ప్రణీత్ ప్రత్తిపాటి దర్శకత్వంలో శేఖర్ అన్నే, సంపత్ మక, సురేశ్ కొత్తింటి నిర్మించారు. గాయకుడు ఎస్పీ చరణ్ కీలకపాత్ర పోషించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం నుంచి 'హే హలో నమస్తే' అంటూ సాగే గీతాన్ని గీత రచయిత చంద్రబోస్, దర్శకుడు అనుదీప్ విడుదల చేశారు. చిత్రబృందానికి ఘన విజయం దక్కాలని చంద్రబోస్ ఆకాంక్షించారు. ఈ చిత్రానికి జోస్ జిమ్మీ సంగీతం ప్రధాన బలం అని నిర్మాతలు చెప్పారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/Q0IoNHD లో చదవండి.

యూత్ టీమ్‌తో ఫైటర్ రాజా



రామ్, మాయా కృష్ణన్ ప్రధాన పాత్రలు పోషించే 'ఫైటర్ రాజా' చిత్రం ఫస్ట్ లుక్‌ను హీరో శ్రీవిష్ణు లాంచ్ చేశారు. ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. చాలా రోజుల తర్వాత ఓ విభిన్నమైన పాత్ర పోషిస్తున్నట్లు తనికెళ్ల భరణి చెప్పారు. రియలిస్టిక్‌గా ఉంటూ యూత్‌ను ఆకట్టుకొనే చిత్రమిదని ఆయన తెలిపారు. నిర్మాతల్లో ఒక్కరైన దినేశ్ యాదవ్ బొల్లెబోయిన మాట్లాడుతూ 'యంగ్ టీమ్‌తో నిజాయితీగా ఈ చిత్రం తీస్తున్నాం' అని చెప్పారు. 'నా తొలి సినిమా 'పచ్చీస్' కొవిడ్ కారణంగా ఓటీటీలో విడుదలైంది. కానీ 'ఫైటర్ రాజా' థియేటర్లలో సందడి చేస్తుంది' అని హీరో రామ్ చెప్పారు.

కుటుంబ వివాదం.. ముగ్గురి ఆత్మహత్యాయత్నం

▸▸ భార్య మృతి, భర్త, కుమార్తె పరిస్థితి విషమం

▸▸ గుంటూరు ప్రధాన రహదారిపై బంధువుల రాస్తారోకో

తెనాలి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఓ కుటుంబ వివాదంలో అధికార పార్టీ నేతల జోక్యం, ఆపై బాధితులు ఫిర్యాదు చేసినా నాలుగు నెలలుగా పోలీసులు పట్టించుకోకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురై ఆ కుటుంబంలోని ముగ్గురు విషపు గుళికలు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వీరిలో భార్య మృతి చెందగా, భర్త, వారి కుమార్తె ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. గుంటూరు జిల్లా తెనాలిలో ఈ దారుణం జరగగా, బుధవారం ఉదయం నుంచి తెనాలి జిల్లా వైద్యశాలలో బాధితులు చికిత్సపొందుతున్నారు. అయినా, వారి నుంచి పోలీసులు కనీసం స్టేట్‌మెంట్ కూడా తీసుకోలేదంటూ బాధితుల బంధువులు తెనాలి-గుంటూరు ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. బాధితుల బంధువు నీలం రాజ, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గుంటూరు జిల్లా తెనాలిలో నివాసముంటున్న విష్ణుమొలకల శివశంకరరావు టీ స్టాల్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత ఏడాది తన ఒక్కగానొక్క కూతురిని పట్టణానికే చెందిన సత్యనారాయణ, సుధారాణి దంపతుల కుమారుడు నాగసాయిగణేష్‌కు ఇచ్చి వివాహం చేశారు. పెళ్లికి రూ.10లక్షలకు పైగా అప్పు చేశారు. ఆ అప్పులు తీరక శివశంకరరావు కుటుంబం ఓవైపు సతమతమవుతుంటే, మరోవైపు కుమార్తె భర్త, అత్తమామలు అదనపు కట్నం తేవాలంటూ ఇబ్బందులకు గురిచేశారు. దీంతో శివశంకరరావు ఆరు నెలల క్రితం పోలీస్ స్టేషన్లో కేసు పెట్టి, కుమార్తెను తమ ఇంటికి తీసుకొచ్చారు. ఆ తర్వాత ఓ మధ్యవర్తి వచ్చి మాట్లాడుకుందామని పిలిపించి.. వైసీపీకి చెందిన ఓ ప్రముఖ నాయకుడు, అతడి సోదరుడి దగ్గర పంచాయతీ పెట్టారు. ఆ సమయంలో వైసీపీ నేతల ప్రోద్బలంతో తమపై దాడిచేసి గాయపరచగా, ఫిర్యాదు చేసేందుకు స్టేషన్‌కు వెళితే పోలీసులు తమ ఫిర్యాదు తీసుకోలేదని శివశంకరరావు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న సమయంలోనూ పోలీసులు తమ కేసు నమోదు చేయలేదన్నారు. బాధితురాలి అత్తమామల వెనుక అధికార పార్టీ నేతలు ఉన్నారని, పోలీసులు పట్టించుకోకపోవడం వల్లే ఒక నిండు ప్రాణం బలైపోయిందని కన్నీటి పర్యంతమయ్యారు. కాగా, రోడ్డుపై బైఠాయించిన ఆందోళనకారుల వద్దకు పోలీసులు వచ్చి.. న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

సత్వర చికిత్సకేంద్రం ప్రారంభం

తెనాలి రూరల్, మార్చి 13: చిన్నారులకు తక్షణ వైద్య సేవలందించేలా సత్వర చికిత్స కేంద్రం దోహదపడుతుందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. పట్టణంలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాల ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం ద్వారా నిర్మించిన జిల్లా సత్వర చికిత్స కేంద్రాన్ని ఎమ్మెల్యే శివకుమార్ ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ చిన్నారుల్లో ఉత్పన్నమయ్యే అనారోగ్య సమస్యలకు ఈ సత్వర కేంద్రం ద్వారా మెరుగైన వైద్యసేవలందించి వారిని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి, వైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయటమే ధ్యేయం

● ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



వైఎస్సార్ చేయూత చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్, జడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా

కొల్లిపర, మార్చి 13: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రం కొల్లిపర జీవీఆర్ కల్యాణ మండపంలో జరిగిన వైఎస్సార్ చేయూత, ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి ఎంపీడీవో విష్ణుప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ గతంలో ఏదైనా ప్రభుత్వం ఇళ్ల స్థలాలను ఇచ్చిందంటే కేవలం డీకే పట్టాను ఇచ్చి ఊరుకునేవారన్నారు. ఇప్పుడు వైసీపీ ప్రభుత్వంలో రిజిస్ట్రేషన్లు చేసి మరీ సర్వసంపూర్ణ హక్కులతో రిజిస్ట్రేషను పత్రాలను ఇవ్వటం చాలా గొప్ప విషయమన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా మాట్లాడుతూ మహిళల సంక్షేమానికి వైసీపీ ప్రభుత్వం పెద్దపీట వేసినట్లు తెలిపారు. పారదర్శకతతో సంక్షేమ పథకాలు అమలుచేసిన ఘనత సీఎం జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అనంతరం డ్వాక్రా మహిళలకు ఎమ్మెల్యే శివకుమార్, జడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా, ఎంపీపీ భీమవరపు పద్మావతి స్థానిక నాయకులతో కలిసి వైఎస్సార్ చేయూత చెక్కును, ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషను పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శివరామకృష్ణారెడ్డి, సర్పంచ్ రాధిక, తహసీల్దార్ శ్రీనివాసులు, ఏపీఎం ప్రియదర్శిని, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఆటలతోనే ఆరోగ్యం: ఎమ్మెల్యే

తెనాలి రూరల్, మార్చి 13: చిన్నారులను సెల్‌ఫోన్స్‌కు దూరంగా ఉంచుతూ ప్లేగ్రౌండ్‌లలో ఆటలు ఆడుకునేందుకు ప్రోత్సహించడం ద్వారా వారు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తయారవుతారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. బుధవారం పట్టణంలోని బాలాజీరావుపేట 33వ వార్డులో భవిత స్కూల్ ప్రాంగణంలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ప్లేగ్రౌండ్, అందులో సమకూర్చిన పరికరాలను ఎమ్మెల్యే శివకుమార్ ముఖ్యఅతిథిగా హాజరై రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. పలువురు వైసీపీ నాయకులు, దాతలు, తదితరులు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ ఆశ్రమానికి రూ.25 వేలు ఆర్థిక సాయం

తెనాలి అర్బన్, మార్చి 13: మహాత్మాగాంధీ వృద్ధాశ్రమానికి మానవతా స్వచ్ఛంద సంస్థ చైర్మన్ కొలసాని రాంచంద్ రూ.25వేలు ఆర్థిక సాయం అందజేశారు. బుధవారం ఆయన తమ తల్లి సీతారావమ్మ పేరిట ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారికి నగదు అందించారు. సంస్థ రీజనల్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, వృద్ధుల కోసం ఎన్నో ఏళ్లగా ఆశ్రమాన్ని నడపటం అభినందనీయమన్నారు. దాతల సహకారం అందించి ఆశ్రమం ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనసాగించేలా చూడాలన్నారు. తన్నీరు శ్రీనివాస్, ప్రసాద్, సోమయ్యశాస్త్రి, శర్మ, వెంకట్, వాసు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

● ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్



శలపాడులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న నరేంద్ర కుమార్

చేబ్రోలు, మార్చి 13: గ్రామాలో స్థానిక సమస్యలను గుర్తించి మౌలిక వసతుల కల్పనకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తామన్న, మాజీ ఎమ్మెల్యే సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. మండల పరిధిలోని శలపాడు గ్రామంలో బుధవారం నరేంద్రకుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో వివిధ ప్రాంతాలలో జరిగిన ఆత్మీయ సమావేశాల్లో నరేంద్రకుమార్ పాల్గొని స్థానికులను కలుసుకుని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా పలువురు మహిళలు మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి ఇబ్బందులు అధికంగా ఉన్నాయని వాపోయారు. రైల్వేస్టేషన్ సెంటర్ ప్రాంతంలో ఒ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయించాలని విజ్ఞప్తి చేసారు. గ్రామస్థులు మాట్లాడుతూ రైల్వే ట్రాక్ వద్ద అండర్ పాస్ మంజూరు చేయించాలని కోరారు. పంట పొలాల నుంచి రైతులు రాకపోకలు సాగించేందుకు పంట ఉత్పత్తులు తరలించేందుకు డొంక రోడ్డు నిర్మించాలని విజ్ఞప్తి చేసారు. గ్రామంలో సైడ్ డ్రెయిన్ల నిర్మాణం చేపట్టి మురుగునీటి సమస్యకు పరిష్కారం చూపాలని, శ్మశాన వాటికను ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని ఆరోపించారు. పాలకులు ప్రజా సమస్యలను గాలికి వదిలేసారని దుయ్యబట్టారు. దోపిడీలు తప్ప, మౌలిక వసతుల కల్పనకు దృష్టి పెట్టలేదన్ని ధ్వజమెత్తారు.

రానున్న టీడీపీ, జనసేన ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధికి మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త వడ్రాణం మార్కండేయ బాబు, టీడీపీ జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉమ్మడి కూటమి అభ్యర్థులను గెలిపించండి

● తెనాలి నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల



ప్రచార యాత్రలో ప్రజలతో మాట్లాడుతున్న నాదెండ్ల మనోహర్, పార్టీల శ్రేణులు

తెనాలి రూరల్, మార్చి 13: తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమిని రానున్న ఎన్నికల్లో ప్రజలందరూ గెలిపించుకుంటేనే రాష్ట్రంలో సుపరిపాలన సాధ్యమని తెనాలి నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నాదెండ్ల మనోహర్ తలపెట్టిన తెలుగు జనచైతన్య యాత్రలో భాగంగా బుధవారం పట్టణంలోని జైనుల దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచార యాత్రగా ప్రజల వద్దకు వెళ్లారు. ఈ సందర్భంగా వైసీపీ పాలనలో ప్రజల స్థితిగతులపై విచారించిన అనంతరం నాదెండ్ల మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదేళ్లుగా అభివృద్ధి శూన్యమన్నారు. రాష్ట్రాన్ని మరో 20ఏళ్ల వెనక్కునెట్టేలా రివర్స్‌పాలన చేసిన ఘనత జగన్ ప్రభుత్వానిదని విమర్శించారు. ఐదేళ్లు కావస్తున్న వైసీపీ పాలనలో రోడ్లు డొంకలుగా మారుతున్న పరిస్థితిని మనం చూస్తున్నామన్నారు. ప్రభుత్వమంటే ప్రజలకు భరోగా ఉండాలని ఇలా కనీస మౌలిక సదుపాయాలు కూడా కల్పించకుండా అభివృద్ధి సంక్షేమానికి పెద్దపీటవేశామని అసత్య ప్రచారం చేసుకోవడం ఆ పార్టీ దిగజారుడుతనానికి నిదర్శనమని ఆక్షేపించారు. అక్కచెల్లెమళ్లకు అండగా నిలుస్తానని చెప్పిన జగన్ గ్యాస్ నుంచి విద్యుత్, బస్సు చార్జీలు, నిత్యావసరాల ధరలుపెంచి వారిపై మోయలేని భారం మోపుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ కల్పిస్తూ విడుదల చేసిన మినిమేనిఫెస్టోలోని పలు పథకాలను ప్రజలకు వివరించి బాబు ష్యూరిటీ బాండ్లను అందించారు. మనోహర్ పాదయాత్రకు అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. మెడికల్ షాపుల వ్యాపారులు మనోహర్‌కు ఫ్రూట్స్‌తో తయారుచేయించిన ప్రత్యేక దండను వేసి సత్కరించారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో టీడీపీ,జనసేన, బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.

తెనాలి ఇన్నర్ రింగ్ రోడ్డుకు కృషి చేస్తా

తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే తెనాలికి ఇన్నర్ రింగ్‌రోడ్డును వేసేందుకు కృషి చేస్తానని జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ చెప్పారు. బుధవారం పాదయాత్ర అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ తెనాలి వ్యాపార రంగంలో అగ్రగామిగా నిలిచేలా తాను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటానన్నారు. తెనాలి - మంగళగిరికి నాలుగులైన్ల రహదారిని ఏర్పాటు చేయడంతోపాటు నాన్‌స్టాప్ బస్సులను సైతం పెంచనున్నట్లు చెప్పారు. వైసీపీ పాలనలో తెనాలిలో అభివృద్ధి జరగకపోగా వ్యాపారులు బిక్కు బిక్కు మనే పరిస్థితి తలెత్తిందని ఆరోపించారు. తాము అధికారం చేపట్టిన వెంటనే తెనాలి అభివృద్ధికి తొలిప్రాధాన్యం ఇస్తానని హామీ ఇచ్చారు. శాంతిభద్రతలను కూడా పరిరక్షించి వ్యాపార సంస్థలకు రక్షణగా నిలిపేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పలువురు వ్యాపారులు, పార్టీల శ్రేణులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న జైనులతో నాదెండ్ల మనోహర్

జైనులకు అండగా ఉంటాం.. ఆశీర్వదించండి

జైనులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తామని రానున్న ఎన్నికల్లో తమకు మద్దతు ప్రకటించి ఆశీర్వదించాలని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. బుధవారం నాదెండ్ల మనోహర్ జైను సంఘీయులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తెనాలి ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు రానున్న ఎన్నికల్లో తమను గెలిపించాలని కోరారు. జైనుల సమస్యలను తెలుసుకున్న మనోహర్ తాము అధికారం చేపట్టిన వెంటనే వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆత్మీయ సమావేశానికి వచ్చిన మనోహర్‌ను జైను సంఘ పెద్దలు సాదరంగా ఆహ్వానించి వారి ఆచారం ప్రకారం సత్కరించి పుష్ప గుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో జైను సంఘీయులు, తదితరులు పాల్గొన్నారు.

పసుపు రైతులను ఆదుకోవాలి

తెనాలి అర్బన్, మార్చి 13 : దుగ్గిరాల కోల్డ్ స్టోరేజీ అగ్ని ప్రమాదంలో బాధిత పసుపు రైతులను ఆదుకోవాలని రైతు నాయకులు ములకా శివసాంబిరెడ్డి కోరారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. నష్టపోయిన రైతులకు మార్కెట్ రేటు ప్రకారం రూ.14 వేలు ఇవ్వాలని, యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. చంద్రశేఖర్, వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.



కళాశాలలో ఉద్యోగాలకు ఎన్నికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ సిస్టర్ షైనీ తదితరులు

జేఎంజేలో ప్రాంగణ ఎంపికలు

తెనాలి, మారీసుపేట మార్చి 13: పట్టణంలోని జేఎంజే మహిళా కళాశాలలో బుధవారం ప్రాంగణ ఎంపికలను ఐసీఐసీఐ బ్యాంకు హైదరాబాదు వారు నిర్వహించారు. ఈ డ్రైవ్‌ను రెండు రోజులుగా ఐసీఐసీఐ బ్యాంకు హెచ్‌ఆర్ సీచ్ రాజేష్ నిర్వహించి 24మంది విద్యార్థినులను ఎంపిక చేశారు. ఎంపికైన వారికి సంవత్సరానికి 2.5 లక్షలు ప్యాకేజీ ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంటు డాక్టర్ సిస్టర్ థెరీసమ్మ ఎంపికైన విద్యార్థినులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిస్టర్ షైని, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ శారద, ప్లేస్‌మెంటు ఆఫీసర్ డాక్టర్ సుధాకరయ్య, విద్యార్థినులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలలో వసతులు ఏర్పాటు చేయండి

● మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట మార్చి 13: పట్టణంలోని పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులు ఏర్పాటుచేయాలని పట్టణ మున్సిపల్ కమిషనర్ బి శేషన్న అధికారులకు సూచించారు. పట్టణంలో బుధవారం 33, 38, 39 మరియు 40 వార్డులలో గల 77, 78, 114 నుండి 117 వ పోలింగ్ కేంద్రాలలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పోలింగ్ బూత్‌లలోని మౌలిక వసతులను పట్టణ మున్సిపల్ కమిషనర్ బి శేషన్న పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు నీటి కుళాయి ట్యాపలను, విద్యుత్ దీపాలను ఏర్పాటుచేయాలని తగు సూచనలు జారీచేశారు. కార్యక్రమంలో అసిస్టెంటు సిటీ ప్లానర్-, డీఈలు టీపీఎస్‌లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గీతాంజలి ఆత్మహత్య విచారకరం

తెనాలి అర్బన్, మార్చి 13: సోషల్ మీడియాలో ట్రోలింగ్ కారణంగా గీతాంజలి ఆత్మహత్య చేసుకోవడం విచారకరమని సీపీఎం నాయకులు ములకా శివసాంబిరెడ్డి అన్నారు. ఆమె కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, శాశ్వత భూహక్కు పట్టాల పంపిణీలో లబ్ధిపొంది తన సంతోషాన్ని సోషల్ మీడియాలో వ్యక్తం చేయడం ఆమె ఆత్మహత్యకు దారి తీయడం సమాజం ఎటుపోతుందో ఆలోచించాలన్నారు. ఆమె కుమార్తె చదువుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

సంజీవయ్య, ఆజాద్ విగ్రహాలను ఏర్పాటు చేయాలి

తెనాలి, మారీసుపేట మార్చి 13: తెనాలి పట్టణంలో ఏర్పాటు చేస్తున్న తెనాలి బండ్‌పై ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య తొలి ఉన్నత విద్యాశాఖమంత్రి అయిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ విగ్రహాలను ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ గుంటూరు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు దారా రామకృష్ణ డిమాండ్ చేశారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ బి.శేషన్నను కాంగ్రెస్ పార్టీ గుంటూరు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు దారా రామకృష్ణ, ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు జాకీర్ వినతిపత్రాన్ని అందజేశారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలకు సహకరించండి

● రూరల్ ఎస్ఐ కోటేశ్వరరావు

తెనాలి రూరల్, మార్చి 13: రాబోయే ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా రాజకీయ పార్టీల శ్రేణులు, గ్రామస్థులు సహకరించాలని రూరల్ ఎస్ఐ. పి.కోటేశ్వరరావు అన్నారు. బుధవారం మండలంలోని కొలకలూరు, బుర్రిపాలెం, నందివెలుగు గ్రామాల్లో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో రూరల్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చింపయ్యకు ఉపాధ్యాయ రత్న పురస్కారం

తెనాలి అర్బన్, మార్చి 13 : విశ్రాంత ఉపాధ్యాయుడు యండ్రపాటి చింపయ్యను ఉపాధ్యాయ రత్న పురస్కారంతో సత్కరించారు. యునెస్కో క్లబ్ ఆఫ్ గుంటూరు ఆయన అందిస్తున్న సేవలను గుర్తించి బుధవారం పురస్కారం ప్రదానం చేసింది. గణిత ఉపాధ్యాయునిగా సేవలు అందించడంతో పాటు పలు విద్యా కార్యక్రమాలను నిర్వహించారు. ఆయనకు క్లబ్ అధ్యక్షుడు పరమేశ్వరరావు, సభ్యులు సత్కారం అందించారు.



మున్సిపల్ కార్మికులకు దుస్తులను పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, కమీషనర్ శేషన్న తదితరులు

మున్సిపల్ కార్మికులకు దుస్తుల పంపిణీ

తెనాలి, మారీసుపేట మార్చి 13: పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ కార్మికులకు దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ కమీషనర్ బి శేషన్న ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పాల్గొని కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంటు కమిషనర్ అనూష, మున్సిపల్ అధికారులు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

నరేంద్ర కుమార్‌ను విమర్శించే అర్హత అంబటికి లేదు

● టీడీపీ నాయకులు

పొన్నూరు టౌన్, మార్చి 13: ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌ను కాని, వారి కుటుంబాన్ని కానీ విమర్శించే అర్హత అంబటి మురళీకృష్ణకు లేదని టీడీపీ పార్లమెంట్ రైతు విభాగం ప్రధాన కార్యదర్శి బొర్రు రామారావు అన్నారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ పొన్నూరుకు కొత్తగా వచ్చిన మురళీకృష్ణ వాస్తవాలు తెలియకుండా మాట్లాడుతున్నారన్ని విమర్శించారు. అక్రమ మైనింగ్ విషయంలో ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఇప్పటికే పలుమార్లు విచారణ కోరుతూ ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారని గుర్తు చేశారు. ఆ ఫిర్యాదులపై విచారణ చేయించి వాస్తవాలు బయటపెట్టే దమ్ము, ధైర్యం అంబటికి ఉందా అని ప్రశ్నించారు. వీరనాయకుపాలెంలో దళిత రైతులకు చెందిన 60ఎకరాల అసైండ్ భూములో వైసీపీ నాయకులు చేసిన అక్రమ మైనింగ్ దందాపై రాష్ట్ర హైకోర్టు ఇటీవలే అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ నివేదిక ఇవ్వాలని ఆదేశించింది తెలుసా అన్ని ప్రశ్నించారు. ఈ అక్రమ మైనింగ్ దందాపై వాస్తవ నివేదికలు బయటపెట్టే ధైర్యం అంబటికి ఉందా అని ప్రశ్నించారు. సంగం డెయిరీ గురించి అవాస్తవాలు మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. అమూల్ తెచ్చి రైతుల పాల సేకరణలో విఫమైతే ఏం చేయాలో అర్థంకాక సంగం డెయిరీని దెబ్బతీసేందుకు వైసీపీ పాలకులు అక్రమ కేసులు బనాయించారని ఆరోపించారు. నరేంద్రకుమార్‌ను జైలులో పెట్టి కేసులు బనాయించినప్పటికి రాష్ట్రంలో ఒక్క పాల రైతు కూడా నరేంద్ర కుమార్‌ను వదిలి వెళ్లలేదని సంగం డెయిరీనే నమ్మారన్నారు. సంగం డెయిరీ అక్రమాలపై ఎన్ని ఆరోపణలు చేసినప్పటికీ ఒక్క ఆరోపణనను నిరూపించలేకపోయారని ఎద్దేవా చేసారు. డీవీసీ హాస్పటల్ ఏర్పాటుచేసి జిల్లావ్యాప్తంగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారన్నారు. కరోనా క్లిష్ట సమయంలో పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందచేసి ప్రాణాలు నిలిపిన చరిత్ర నరేంద్ర కుటుంబానిదన్నారు. ఇవి ఏవీ తెలియకుండానే డెయిరీపై హాస్పటల్‌పై విమర్శిస్తున్న అంబటి మురళీకృష్ణ వాస్తవాలు తెలుసుకోవాలని హితవు పలికారు. అలాగే అంబటి మురళీకృష్ణ సత్తెనపల్లి బాగోతాలు ఆయన కంటే ముందు పొన్నూరు వచ్చాయని సత్తెనపల్లి నుంచి రెండేళ్ల క్రితం ఎలా బయటకు వచ్చారో ప్రతి ఒక్కరికీ తెలుసన్నారు. అనవసర ఆరోపణలు మానుకొని ముందు అభ్యర్థిత్వాని తెచ్చుకోమని అంబటికి హితవు పలికారు. సమావేశంలో టీడీపీ పోల్ మేనేజ్‌మెంట్ కోఆర్డినేటర్ మాదాల వెంకటేశ్వరరావు పట్టణ, మండల అధ్యక్షుడు పఠాన్ అహ్మద్‌ఖాన్, బండ్లమూడి బాబురావు, ఎద్దు సోంబాబు, సొపాటి వెంకట్రావు, మధు పాల్గొన్నారు.



ఆహారం పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

అన్న క్యాంటీన్‌లో ఆహారం పంపిణీ

తెనాలి, మారీసుపేట మార్చి 13: పేద ప్రజల కోసం పట్టణంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌ల సేవలు కొనసాగుతున్నాయని టీడీపీ నాయకులు తెలిపారు. గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకుడు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సౌజన్యంతో స్థానిక మార్కెట్ సెంటరులోని అన్న క్యాంటీన్‌లో, శివాజీచౌక్‌లోని అన్న క్యాంటీన్‌లలో బుధవారం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో క్రొత్తపల్లి రమేష్, సోమవరపు సాంబశివరావు, జి.రమేష్, ఎం.వెంకట్, వెల్లంకి సాంబయ్య, మాదల కోటేశ్వరరావు, ఎ.వెంకటేశ్వరావు, సంజయ్, కామేశ్వరావు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎలక్టోరల్ బాండ్లపై కేంద్రమే జవాబు ఇవ్వాలి

● కాంగ్రెస్ కన్వీనర్ డాక్టర్ చందు సాంబశివుడు

తెనాలి అర్బన్, మార్చి 13: ఎలక్టోరల్ బాండ్లపై కేంద్ర ప్రభుత్వమే జవాబు చెప్పాలని నియోజకవర్గ కాంగ్రెస్ కన్వీనర్ డాక్టర్ చందు సాంబశివుడు ప్రశ్నించారు. మారీసుపేటలోని పార్టీ కార్యాలయంలో బుధవారం మండల కాంగ్రెస్ అధ్యక్షునిగా కర్లపూడి బుల్లియ్య, కొల్లిపర మండల పార్టీ అధ్యక్షుడిగా సిద్దెల రామకృష్ణను నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను స్కాంల పాలన అని ధ్వజమెత్తుతున్న నాయకులు ఇప్పుడేం చేస్తారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నికలు దృష్టిలో పెట్టుకుని గ్యాస్ ధరను రూ.100 తగ్గించడం మహిళలు నమ్మబోరని చెప్పారు. విభజనకు గురైన రాష్ట్రానికి ఎలాంటి సాయం అందించని బీజేపీతో టీడీపీ, జనసేనలు కలవడం సరికాదన్నారు. కాంగ్రెస్‌ను మళ్లీ అధికారంలోకి తెచ్చేందుకు ప్రజలు ఓటు వేయాలని అప్పుడే రాష్ట్రానికి హోదాతో పాటు అభివృద్ధి కూడా జరుగుతుందన్నారు. పార్టీ నాయకులు పొన్నూరు శశి, అయప్ప, శివకుమార్, సుబ్బారావు పాల్గొన్నారు.

కోర్టు ప్రహరీకి నూతన గేట్లు ఏర్పాట్లు

తెనాలి క్రైం, మార్చి 13: కోర్టు ప్రహరీకి నూతనంగా ఏర్పాటు చేసిన గేట్లను బుధవారం ప్రారంభించారు. ప్రస్తుతం మూడువైపులా గేట్లు ఉండగా రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా నాల్గోవైపు కూడా దాత సీనియర్ న్యాయవాది అయిన తాడిబోయిన శ్రీవాసరావు ఆర్థికసాయంతో ఏర్పాటుచేశారు. బుధవారం నూతన గేటును బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందలపు వేణుగోపాలరావు ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి షేక్ అబ్దుల్ షరీఫ్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రాజశేఖర్, 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.శ్రీసీత, బార్ అసోసియేషన్ కార్యదర్శి హరిదాసు గౌరీశంకర్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.